PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com

epaper.vaarthasadhya.com

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ & అమరావతి మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.

CM NEWS For The People

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు జిల్లా స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7396122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

13-22/42, Plot No.203, VV Nagar Colony, Gaddiannaram, Ranga Reddy Dist. - Hyderabad, Telangana 500060

Published From : Rangareddy VOLUME : 01 Issue : 251 Tuesday 1-09-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

## సర్' ద్వారా దేశ జనాభాను ఈసీ తగ్గిస్తున్నది



02

- ఢిల్లీలో 47 లక్షల ఓటర్ల పేర్లు తొలగింపుపై ఆప్ అధినేత ఆగ్రహం
- 'సర్' పేరుతో ఓటర్లను తగ్గిస్తున్నారని ఎన్నికల సంఘంపై విమర్శలు
- 1.45 కోట్ల ఓటర్లలో 97.53 లక్షల పేర్లే ముసాయిదా జాబితాలో
- జనాభా పెరుగుదలపై ఆందోళన అవసరం లేదంటూ కేజ్రీవాల్ వ్యంగ్యాస్త్రాలు
- '140 కోట్లను 50 కోట్లకు తగ్గించే శక్తి సర్‌కే ఉంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య
- జూన్ 30 నుంచి ఆగస్టు 7 వరకు సాగిన ప్రత్యేక సవరణ ప్రక్రియ
- 67 శాతం ఓటర్ల వివరాలే డిజిటలైజ్ చేసినట్లు ఈసీ వెల్లడి
- ఢిల్లీ ఓటర్ల జాబితాపై రాజకీయ దుమారం రేపిన ఆప్ ఆరోపణలు

## భారత్-రష్యా బంధానికి కొత్త బలం



02

- మోదీ--పుతిన్ భేటీ
- బిష్కెక్ లో ఎస్సీవో సదస్సు సందర్భంగా కీలక ద్విపాక్షిక చర్చలు..
- ఇంధనం, ఎరువులు, రక్షణ, వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలపై ఫోకస్
- యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల అవకాశాలపైనా ఆసక్తి..
- మారుతున్న ప్రపంచ పరిణామాల మధ్య ప్రాధాన్యం సంతరించుకున్న భేటీ



## కృష్ణాజలాలపై సీఎం మౌనం..

- తెలంగాణకు తీరని ద్రోహం
- ఏపీ ప్రభుత్వానిది అడ్డగోలు నీటి దోపిడీ
- కేఆర్ఎంబీది ప్రేక్షకపాత్రే
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్

కృష్ణా జలాల దోపిడీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనంగా ఉండడం తెలంగాణకు తీరని ద్రోహం చేయడమే అవుతుందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం అక్రమంగా దోపిడీ చేస్తున్నదని సోమవారం ఎక్స్ ద్వారా ఆయన ట్వీట్ చేశారు. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా నీటిని తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి తీరని నష్టమని తెలిపారు. నీటి కేటాయింపులు లేకున్నా వరద జలాలు రాకున్నా వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తున్నదని పేర్కొన్నారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో


-మిగతా 2 లో



02

## టీవీకే-కాంగ్రెస్ మధ్య విభేధాలు..

- ప్రధానిగా రాహుల్‌కు విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టు
- మద్దతు లేకుంటే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- విజయ్‌ను జాతీయ నాయకుడిగా ప్రాజెక్ట్ చేస్తున్న టీవీకే నేతలు
- కూటమి బలంపై కాంగ్రెస్ వ్యాఖ్యలు.. రాజకీయంగా వేడెక్కిన తమిళనాడు



02

## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

- కెనడా దారుణమైన దుర్వినియోగదారు
- కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి
- ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు

## బహుజన తెలంగాణ కావాలి

### ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తేవాలన్న సంకల్పంతో ముందుకు వచ్చా

- ఏ తప్పు చేయకుండానే జైల్లో పెట్టారు.. అప్పుడే నేను ఏ తప్పు చేయలేదని చెప్పా
- నాలుగేళ్లు ఈడీ, సీబీఐ ఇబ్బంది పెట్టినా ధైర్యం సడలలేదు.. దారి తప్పలేదు
- అమ్మ ఇంటివాళ్లు నిర్ధాక్షణ్యంగా తరిమేస్తే అత్తింటి వాళ్లు కన్న బిడ్డలా అక్కున చేర్చుకున్నారు
- తండ్రి, కూతురును పాపిన ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను.. నా ఉసురు తగులుతుంది
- ఓ వైపు కాంగ్రెస్ పై పోరాటం చేస్తూనే టీఆర్ఎస్ నిర్మాణం చేస్తాం
- వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ :

తెలంగాణకు ఇప్పుడు కావాల్సింది బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ సాధించుకుంటే జీవితాలు మారిపోతాయని భావించి ప్రజలకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరముందని ఆమె అన్నారు. సోమవారం నిజామామాబాద్ లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత ప్రసంగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నాలుగిండ్లు మాత్రమే బంగారు మాయమయ్యాయని అన్నారు.

-మిగతా 2 లో







## నేపాల్‌కు మళ్లీ ముప్పు

- పెరిగిన భోటేకోసి నీటి మట్టం
- చైనా నుంచి వరద హెచ్చరికలు
- 903కు చేరిన మృతులు
- 5,000 మందికి పైగా మిస్సింగ్
- సారంగాల్లో భారత్ బృందం వెతుకులాట
- కుళ్లిపోతున్న మృతదేహాలు.. సామూహిక అత్యేష్టియులు
- గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు షురూ

ఖాట్మండు:

ఆగస్టు 26న నేపాల్, టిబెట్ సరిహద్దు హిమాలయాల్లో మంచు, రాయి కరగడంతో మొదలైన ఆకస్మాత్తు వరదలో నేపాల్ జాతీయ విపత్తు ప్రాధికార సంస్థ సోమవారం సాయంత్రం విడుదల చేసిన లెక్కల ప్రకారం 903 మంది మరణించారు. 5,000 మందికి పైగా తప్పిపోయినవారు. తప్పిపోయినవారిలో 592 మంది విదేశీయులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేసిన 933 మంది, భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. 10,451 మందిని రక్షించారు. మృతదేహాలు ఎక్కువగా చిత్వన్ జిల్లాలో 272, తూర్పు నావల్పరాసిలో 207, పశ్చిమ నావల్పరాసిలో 151, నువాకోట్‌లో 95, గోర్ఖాలో 62, ధాడింగ్‌లో 55, తనహూన్‌లో

-మిగతా 2 లో

## విపక్షం విఫలం

- రోజుల్లో ఒక్కరోజైనా అసెంబ్లీకి రాని కెసిఆర్
- బంధువులు చనిపోతే వెళ్తారు.. మనవడు గాయపడితే పరామర్శిస్తారు.. కానీ ప్రజల కోసం ఒక్కరోజూ బయటికి రారు
- ఈ వెయ్యి రోజుల్లో కెసిఆర్ కు రూ.1.24 కోట్ల జీతం
- ఆయన భద్రతకు రూ.22కోట్ల ఖర్చు
- వెయ్యి రోజుల్లో నేను ఒక్కరోజు సెలవు తీసుకోలేదు
- నాకు, ఆయనకు పోలికా?
- కెసిఆర్ రాజీనామా కోరుతూ 6న ఇందిరా పార్కు వద్ద భారీ స్థాయిలో నిరసన
- 7నుంచి అసెంబ్లీలో బిఆర్ఎస్ భాగోతం బయటపెడతా
- 32 నెలలుగా ఫస్ట్ నే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం
- ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. ఉద్యోగుల జీతాలు ఆపలేదు
- అంబర్ పేటలో 10 ఎకరాల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు
- అల్వాల్ టిమ్స్ కు అంజయ్య.. ఎల్బీనగర్ టిమ్స్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ.. వరంగల్ ఆస్పత్రికి జయశంకర్ పేర్లు పెడతాం
- హైదరాబాద్ లోని మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

**కెసిఆర్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నేటినుంచి ఊరూరా ఆందోళనలు**



హైదరాబాద్

కెసిఆర్ కు, నాకు పోలికా..? నందికి, పందికి ఉన్నంత తేడా ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. 1,000 రోజుల ప్రభుత్వ సొమ్ము మెక్కి గంట కూడా పనిచేయని కెసిఆర్ వెంటనే రాజీనామా చేయాలని అన్ని చోట్లా నిరసనలు తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నేటి నుంచి ఆరు రోజుల పాటు ప్రతిపక్ష నాయకుడు రాజీనామా చేయాలన్న డిమాండ్ తో నిరసనలు తెలపాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈనెల 06వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమాన్ని

-మిగతా 2 లో





## ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలనకు వెయ్యి రోజులు

- ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మక ఘట్టం
- రైతు, మహిళ, యువత సంక్షేమమే ప్రభుత్వ విధానాల కేంద్రబిందువు
- రూ.2 లక్షల రుణమాఫీతో 25 లక్షలకుపైగా రైతులకు లబ్ధి
- రైతుభరోసా, బోనస్‌లతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్
- 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలతో యువతకు భరోసా
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
- బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్లతో సామాజిక న్యాయానికి పెద్దపీట
- ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్

ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం ఒక మైలురాయి అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వెయ్యి రోజుల పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన శు భాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతులు, మహిళలు, యువత, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి 25.35 లక్షల మంది రైతులకు రూ. 20 వేల కోట్లకు పైగా ప్రయోజనం కల్పించామని చెప్పారు. రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.

-మిగతా 2 లో

వార్త సంధ్య

# నేపాల్‌కు మళ్లీ ముప్పు

మొదటి తరువాయి

37, రసువా జిల్లాలో 24 వెలికితీశారు. వరద మొదలైన రసువాలో తక్కువ మృతదేహాలు వెలుగులోకి రాగా గల్లంతు అయిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. నువాకోట్‌లో 1,548 మంది, రసువాలో 865 మంది తప్పిపో యినట్లు జిల్లా కేంద్రాల వర్గాలు వెల్లడించాయి. టిబెట్ వైపు 16 మంది మరణించారు, 546 మంది తప్పిపోయారు. రెండు వైపులా కలిపి మృతులసుమారు 919, తప్పిపోయినవారు సుమారు 4,793గా నమోదైంది. మొత్తంగా 90 వేల మందికి పైగా వరద బాధితులయ్యారు. త్రిశూలి, చిలిమే, లాంగ్‌టాంగ్ ప్రాంతాల్లో జలవిద్యుత్ సొరంగాల్లో ఇంకా చిక్కుకున్నవారి కోసం నేపాల్ సైన్యం, భారత సొరంగ రక్షణ బృందం కలిసి వెతుకుతున్నాయి. సుమారు 90 మంది సొరంగాల్లో ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. భోటేకోసి నది నీటి మట్టం మళ్లీ పెరిగిందని చైనా వైపు నుంచి సమాచారం రావడంతో కొత్త వరద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. వర్షం, దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు హెలికాప్టర్ల ద్వారా సహాయక, రక్షణ చర్యలను ఆలస్యం చేస్తున్నాయి. బాట్లుండు నుంచి రసువాగడి, చైనా సరి హద్దు మార్గం పలు చోట్ల కొట్టుకుపో యింది. పునరుద్ధరణకు నెలలు పట్టవ చ్చు. దిగువ జిల్లాల్లో మృతదేహా లు కుళ్లిపోతుండటంతో సామూహిక అత్యేష్టియులు జరుగుతున్నాయి. గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు మొదల య్యాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలనకు వెయ్యి రోజులు

మొదటి తరువాయి

36 వేల కోట్లు అందించామని, ఎకరానికి రూ. 12 వేలకు పెంచామని వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్లకు బోనస్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశామని తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ. 1.75 లక్షల కోట్లు ఖర్చు చేసి రికార్డు సృష్టించామని, ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం రూ. 30 వేల కోట్లు, రైతుభీమాకు రూ. 3,500 కోట్లు, సన్నవడ్ల బోనస్‌కు దాదాపు రూ. 4 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. పేదల సంక్షేమంలో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ. 500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, మొత్తం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మందికి ప్రయోజనం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

యువతకు ఉద్యోగాలు.. విద్యకు పెద్దపీట :

తెలంగాణ యువతలో విశ్వాసం కలిగించేలా 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభించడంతో పాటు 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.

సామాజిక న్యాయానికి తెలంగాణ దిక్సూచి :

బీసీ కులగణనతో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయడం విప్లవాత్మక చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్దేశించిన సామాజిక న్యాయ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# సర్' ద్వారా దేశ జనాభాను ఈసీ తగ్గిస్తున్నది

- ఢిల్లీలో 47 లక్షల ఓటర్ల పేర్లు తొలగింపుపై ఆప్ అధినేత ఆగ్రహం
- 'సర్' పేరుతో ఓటర్లను తగ్గిస్తున్నారని ఎన్నికల సంఘంపై విమర్శలు
- 1.45 కోట్ల ఓటర్లలో 97.53 లక్షల పేర్లే ముసాయిదా జాబితాలో
- జనాభా పెరుగుదలపై ఆందోళన అవసరం లేదంటూ కేజ్రీవాల్ వ్యంగ్యాస్త్రాలు
- '140 కోట్లను 50 కోట్లకు తగ్గించే శక్తి సర్‌కే ఉంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య
- జూన్ 30 నుంచి ఆగస్టు 7 వరకు సాగిన ప్రత్యేక సవరణ ప్రక్రియ
- 67 శాతం ఓటర్ల వివరాలే డిజిటలైజ్ చేసినట్లు ఈసీ వెల్లడి
- ఢిల్లీ ఓటర్ల జాబితాపై రాజకీయ దుమారం రేపిన ఆప్ ఆరోపణలు

న్యూఢిల్లీ



ఓటర్ జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ ద్వారా దేశ జనాభాను ఎన్నికల సంఘం (ఈసీ) తగ్గిస్తున్నదని ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. దీంతో జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. (ూతీజఱఅఎ ఖవయతీఱఖ్శ్రీ) ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 47 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను ఈసీ తొలగించడంపై అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. దేశ రాజధానిలోని సుమారు 1.5 కోట్ల మంది ఓటర్లలో 47 లక్షల పేర్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శించారు. 'జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందకూడదు. ఎందుకంటే 'సర్' ప్రక్రియ ద్వారా దేశ జనాభాను 140 కోట్ల నుంచి 50 కోట్లకు ఎన్నికల సంఘం తగ్గించగలదు' అని ఎక్స్ పోస్ట్‌లో మండిపడ్డారు.కాగా, ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. గతంలో నమోదైన మొత్తం 1,45,10,299 మంది ఓటర్లలో 47,56,722 మంది పేర్లు తొలగించారు. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈ ముసాయిదా జాబితాలో 97,53,577 మంది ఓటర్ల వివరాలు ఉన్నాయి. ఢిల్లీలో జూన్ 30న ప్రారంభమైన 'సర్' ప్రక్రియ ఆగస్ట్ 7న ముగిసింది. ఢిల్లీలోని ఓటర్లలో సుమారు 67.18 శాతం మందికి సంబంధించిన వివరాల పత్రాలు సేకరించి డిజిటలైజ్ చేశారు.

# కృష్ణాజలాలపై సీఎం మౌనం..

మొదటి తరువాయి

తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే ఏపీ ప్రభుత్వం నీటి హక్కులపై దండెత్తి కృష్ణాజలాలను తరలిస్తున్నదని తెలిపారు. బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాలువ ఇప్పుడు వెలిగొండ ద్వారా ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తున్నదని పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం ప్రేక్షకపాత్ర వహించడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను ఎవరు కాపాడాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తక్షణమే స్పందించాలనీ, కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులను నింపి ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకం : హరీశ్‌రావు

రాష్ట్రంలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులంలో చదివి పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని సోమవారం ఎక్స్ ద్వారా ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ఆస్తులకే కాకుండా ప్రజల ప్రాణాలకూ భద్రత లేకుండా పోయిందని తెలిపారు. మహిళలకు భద్రత కల్పించలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా?అని ప్రశ్నించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలనీ, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


# విపక్షం విఫలం

మొదటి తరువాయి

ఏర్పాటు చేయాలని, 7వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఎదురుగానే అన్ని విషయాలు చెబుతానని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు న్యాయం చేయాలని అనుకుంటే, నమ్మకం ఉంటే అసెంబ్లీకి కెసిఆర్ రావాలని ఆయన సూచించారు. 1,000 రోజుల్లో రూ.1.24 కోట్ల జీతం కెసిఆర్ తీసుకున్నారని, ప్రభు త్వ ఉద్యోగి ఏడాది పాటు విధులకు రాకపోతే డిస్మిస్ చేస్తారని, మరి కెసిఆర్‌ను ఏం చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదాలో కెసిఆర్ భద్రత, వసతుల కోసం 21 కోట్లు రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని సిఎం తెలిపారు. పదేళ్లలో కెసిఆర్ ఏం చేశారో, 1,000 రోజుల్లో తాము ఏం చేశానో అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సిఎం సవాల్ విసిరారు. ఏనాడూ పదవిని దుర్వినియోగం చేయలేదని, చేయనని, తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ తాను ఒక్కడినేనని చెప్పి అధికారంలోకి రాగానే ఆ తర్వాత మొత్తం తన కుటుంబాన్ని దించి గుంపు మండలా జమ్మి మంది సొమ్ము తిన్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఎవరైనా ప్రతిపక్ష నాయకుడు 1,000 రోజులు బయటకు రాకుండా ఉన్నారా..? అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాన ప్రతిపక్షం వైఫల్యం చెందిన రాష్ట్రం తెలంగాణ అని ఆయన ఆరోపించారు. మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. నాకు, కెసిఆర్‌కు పోలిక లేదన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి కాగానే ఆయన కొడుకు, అల్లుడిని మంత్రిని చేశారని, తాను ముఖ్యమంత్రి కాగానే పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిని మంత్రులు చేశానన్నారు. తాను సిఎం అయితే వి.హనుమంతరావును ప్రభుత్వ సలహాదారుడిగా చేశానని, అనిల్ యాదవ్‌ను ఎంపి చేశానని, అద్దంకి దయాకర్‌ను ఎంఎల్సి చేశానని తెలిపారు. అప్పట్లో కేటీఆర్ వెంకట్ రామిరెడ్డిని ఎమ్మెల్యే చేస్తే, తాను అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్యే చేశానన్నారు. కెసిఆర్ తన కొడుకును వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే, తాను బలహీన వర్గాల బిడ్డ మహేష్‌కుమార్‌గౌడ్‌ను పిసిసి అధ్యక్షుడిగా చేశానని ఆయన తెలిపారు. 1,000 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించానని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 1000 రోజుల్లో ఒక్కరోజైనా ప్రజలకు ఏం చేశారని కెసిఆర్‌ను ప్రశ్నించారు. మనవడు ఆస్పత్రికి వెళితే, బంధువులు ఎవరైనా చనిపోతే తప్ప బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. కానీ తాను గంటినా సెలవు తీసుకోలేదన్నారు. ఉద్యోగ సంఘాల సమస్యలను అర్థం చేసుకుంటా ఉద్యోగ సంఘాల సమస్యలను తాను అర్థం చేసుకుంటానని, 32 నెలల్లో ఎప్పుడైనా 1వ తేదీన జీతాలు ఇవ్వకుండా ఆపామా? ఉద్యోగులు ఆలోచించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. తుఫాన్ వచ్చినా, కరువు వచ్చినా ఒకటి తేదీనే జీతాలు పేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆనాడు ఎలా ఉంది, ఈనాడు ఎలా ఉందో ఉద్యోగులు ఆలోచించాలన్నారు. ఐదున్నర లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఐదో తేదీనే జీతాలు ఇస్తున్నామని, గతంలో ఆరు నెలలకోసారి జీతాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. రెండు నెలల్లో రూ.6 వేల కోట్ల రిటైర్‌మెంట్ బకాయిలను విడుదల చేశామని ఉద్యోగులు, వాళ్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2023 డిసెంబర్ 7వ తేదీన సిఎంగా ప్రమాణ స్వీకారం చేసి సచివాలయం వెళ్లి సమీక్ష చేస్తే 11 లక్షల మంది ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని అధికారులు చెప్పారన్నారు. ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని అధికారులు పేర్కొన్నారన్నారు. రూ.16 వేల కోట్ల మిగులుతో కాంగ్రెస్ పార్టీ కెటిఆర్‌కు తెలంగాణను అప్పగించిందని, ఏడాదికి రూ.6,500 కోట్లు వడ్డీ కింద చెల్లిస్తే సరిపోయేదని సిఎం తెలిపారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ఒకే ఒక కుటుంబం 8 లక్షల 11 వేల కోట్ల అప్పుల్లో తెలంగాణను నిండా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 ఏళ్లలో 16 మంది ముఖ్యమంత్రులు 70 వేల కోట్ల అప్పు చేస్తే కెసిఆర్ ఒక్కరే తొమ్మిదిన్నర ఏళ్లలో ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేశారని, నెలకు రూ.7,500 కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. అంబర్‌పేటలో పదేకరాల్లో పేదలకు ఇళ్లు కట్టిస్తున్నామని సిఎం తెలిపారు.

# భారత్-రష్యా బంధానికి కొత్త బలం

-మోదీ--పుతిన్ భేటీ
-బిష్కెక్ లో ఎస్సీవో సదస్సు సందర్భంగా కీలక ద్విపాక్షిక చర్చలు..
-ఇంధనం, ఎరువులు, రక్షణ, వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలపై ఫోకస్
-యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల అవకాశాలపైనా ఆసక్తి..
--మారుతున్న ప్రపంచ పరిణామాల మధ్య ప్రాధాన్యం సంతరించుకున్న భేటీ



న్యూఢిల్లీ :

కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్ లో సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ద్విపాక్షికంగా సమావేశమయ్యారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా జరిగిన ఈ భేటీపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. భారత్-రష్యా సంబంధాల్లో కీలకమైన ఇంధనం, ఎరువులు, రక్షణ, వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలు వంటి అంశాలపై ఇరువురు నేతలు దృష్టి సారించారు. ప్రపంచ రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాలు, ఇంధన మార్కెట్లో అనిశ్చితి, రష్యాపై కొనసాగుతున్న పాశ్చాత్య ఆంక్షలు, భారత్-రష్యా వాణిజ్యంలో పెరుగుతున్న అసమానతల నేపథ్యంలో మోదీ--పుతిన్ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

ఇంధన భద్రతకు రష్యా కీలకం : భారత్ కు రష్యా ఇంధన రంగంలో కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. ముఖ్యంగా రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు భారత్ ఇంధన భద్రతకు ప్రాధాన్యంగా మారాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు, సరఫరా మార్గాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మారుతున్న సమయంలో రష్యా నుంచి స్థిరమైన ఇంధన సరఫరాను కొనసాగించడం భారత్ కు ముఖ్యమైన అంశం. చమురు, గ్యాస్ సరఫరా, దీర్ఘకాలిక ఇంధన సహకారం వంటి అంశాలు మోదీ--పుతిన్ చర్చల్లో ప్రాధాన్యం పొందినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ఎరువుల సరఫరాపైనా దృష్టి :

భారత వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువుల సరఫరా కూడా భారత్--రష్యా సంబంధాల్లో కీలకమైన అంశంగా మారింది. దేశీయ రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడటంతో పాటు, అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో ఎదురయ్యే అంతరాయాలను అధిగమించేందుకు రష్యాతో సహకారం భారత్ కు అవసరం. ఇంధనంతో పాటు ఎరువుల దిగుమతులు కూడా భారత్ కు వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగినవే. అందువల్ల భవిష్యత్ లో ఎరువుల సరఫరాను స్థిరంగా కొనసాగించే అంశం ఈ భేటీలో ప్రాధాన్యం పొందింది.

రక్షణ రంగంలోనూ కీలక భాగస్వామ్యం :

భారత్--రష్యా సంబంధాలకు రక్షణ సహకారం దశాబ్దాలుగా ప్రధాన ఆధారం. భారత సైనిక వ్యవస్థలో రష్యా తయారీ పరికరాలు, ఆయుధ వ్యవస్థలకు గణనీయమైన ప్రాధాన్యం ఉంది. రక్షణ పరికరాల నిర్వహణ, విడిభాగాల సరఫరా, సాంకేతిక సహకారం, సంయుక్త తయారీ, భవిష్యత్ రక్షణ ఉత్పత్తి వంటి అంశాలు ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా ఉన్నాయి. ప్రత్యేకంగా ఎస్-400 వాయురక్షణ వ్యవస్థకు సంబంధించిన సహకారం, రష్యా రక్షణ సాంకేతికతతో భారత్ సంబంధాలు వంటి అంశాలు కూడా విస్తృతంగా చర్చకు వస్తున్నాయి. అయితే ఏదైనా కొత్త రక్షణ ఒప్పందం కుదిరిందని అధికారిక ప్రకటన వెలువడితేనే దానిని భారమైన నిర్ణయంగా పేర్కొనడం సముచితం.

వాణిజ్యం పెరిగినా.. లోటు మాత్రం భారీగా :

భారత్--రష్యా ద్విపాక్షిక వాణిజ్యం ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. రష్యా నుంచి భారత్ భారీగా ముడిచమురు దిగుమతి చేసుకోవడం ఇందుకు ప్రధాన కారణం. అయితే వాణిజ్యం పెరుగుతున్నప్పటికీ భారత్ కు రష్యాతో వాణిజ్య లోటు కూడా గణనీయంగా పెరిగింది. మొత్తం ద్విపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్లను దాటినప్పటికీ, భారత వాణిజ్య లోటు 53 బిలియన్ డాలర్లకు పైగా ఉందని తాజా విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రష్యాకు భారత ఎగుమతులను పెంచడం భారత్ కు కీలక లక్ష్యంగా మారింది. ఔషధాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో రష్యా మార్కెట్ ను మరింతగా ఉపయోగించుకోవాలని భారత్ చూస్తోంది.

# టీవీకే-కాంగ్రెస్ మధ్య విభేధాలు..

**ప్రధానిగా రాహుల్‌కు విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టు**
**మద్దతు లేకుంటే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరిక**
**విజయ్‌ను జాతీయ నాయకుడిగా ప్రొజెక్ట్ చేస్తున్న టీవీకే నేతలు**
**కూటమి బలంపై కాంగ్రెస్ వ్యాఖ్యలు.. రాజకీయంగా వేడెక్కిన తమిళనాడు**



తమిళనాడులో విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉంది. అయితే, ఇప్పుడు ఈ కూటమిలో విబేధాలు చోటు చేసుకున్నాయి. ప్రధాని అభ్యర్థి విషయంలో కాంగ్రెస్, టీవీకే పార్టీల మధ్య వివాదం నడుస్తోంది. 2029లో ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీకి విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.లేదంటే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి ఎస్.రాజేశ్ కుమార్ హెచ్చరించారు. తనతోపాటు పి.విశ్వనాథన్ కూడా మంత్రి పదవికి రాజీనామా చేస్తారని ఆయన అన్నారు. దీనికి కారణం ఉంది. 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయ్ ప్రధాని అభ్యర్థిగా ఉంటారంటూ టీవీకే నేతలు తమిళనాడులో ప్రచారం చేస్తున్నారు. విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ఆ పార్టీ నేతలు బలపరుస్తున్నారు. పైగా ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో విజయ్‌న ప్రధాని అభ్యర్థిగా 9 శాతం మంది అంగీకరిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో విజయ్‌కు మద్దతు పెరిగింది. ఇదే కాంగ్రెస్ పార్టీకి ఆగ్రహం తెప్పిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి ఉన్న ఇమేజ్ దృష్ట్యా 2029 ఎన్నికల్లో ఆయనే ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్ ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. దేశానికి కాబోయే ప్రధాని రాహులే అంటూ ఎప్పటినుంచో చెబుతోంది. అలాంటిది, తమిళనాడులో టీవీకే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా చూపెడుతుండటంపై కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వల్లే తమిళనాడులో విజయ్ సీఎం అయ్యారని, ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగారని కాంగ్రెస్ అంటోంది. రాహుల్‌కు మద్దతు ఇవ్వకపోతే కూటమిలో కొనసాగబోమని, మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని ఆ పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు.

# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా దారుణమైన దుర్వినియోగదారు**
**కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి**
**ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు**



వాషింగ్టన్,

అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.----

# బహుజన తెలంగాణ కావాలి

మొదటి తరువాయి



సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాలు బాగుపడాల్సిన అవసరముందని అందుకోసం సామాజిక న్యాయ తెలంగాణ అవసరమని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం 20 ఏళ్లు కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్ నుంచి నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పదవుల కోసం పార్టీ పెట్టలేదని తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం పంతం పట్టి పార్టీ పెట్టానని అన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని కవిత అన్నారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ ఏ విధంగా ఆశీర్వాదం ఇచ్చారో ఇప్పుడు కూడా అదే ఆశీర్వాదం ఇవ్వాలని కవిత నిజామాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సొంత గడ్డపై సొంత మనుషులను చూసి భావోద్వేగానికి లోనైన కవిత తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజల జీవితాల్లో అనుకున్న స్థాయిలో మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ అని చెప్పిన బీఆర్ఎస్ హయాంలో నలుగురి ఇండ్లు మాత్రమే బంగారం మాయం అయ్యాయని చెప్పారు. ప్రజల కోసం ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. బంగారు తెలంగాణ కాదు, ఇప్పుడు కావాల్సింది బహుజన తెలంగాణ అని కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సి ఉందన్నారు. అందుకోసం చిత్తశుద్ధితో పనిచేసేందుకే తాను పార్టీ పెట్టానన్నారు. పదవుల కోసమైతే ఏ రాజకీయ పార్టీలోకైనా వెళ్లవచ్చని...కానీ తాను చూడని పదవులు లేవన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న పతంతోనే నేను పార్టీ పెట్టానన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత తన సొంతగడ్డ నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని చెప్పారు. సొంత గడ్డపై సొంత మనుషులను చూసి కవిత భావోద్వేగానికి లోమయ్యారు. ఎంత ఆపుకుందామనుకున్న కన్నీళ్లు ఆగటం లేదంటూ ఈ సందర్భంగా ఆమె అన్నారు. అలాగని తనను పిరికిదాన్ని అనుకోవద్దని... ఆడబిడ్డల గుండెల్లో బాధ ఉంటే కన్నీళ్లు వస్తాయని చెప్పారు. ఇక గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ గెలిపించి తనను ఎలా ఆశీర్వదించారో అదే విధంగా తనకు ఆశీర్వాదం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఏ తప్పు చేయకున్న సరే తీహార్ జైల్లో పెట్టినప్పటికీ ధైర్యం సడలలదేని, దారి తప్పలేదని కవిత గుర్తు చేసుకున్నారు. అప్పుడే తాను తప్పు చేయలేదని, నిజామాబాద్ నిప్పు బిడ్డనని చెప్పానని అన్నారు. ఈడీ, సీబీఐ తనను ఇబ్బంది పెట్టిన సమయంలో అండగా ఉండాల్సిన బీఆర్ఎస్ పార్టీ నిర్దాక్షిణ్యంగా తనను బయటకు పంపించిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పై కక్షతో తనను అరెస్ట్ చేశారని చెప్పిన బీఆర్ఎస్ పెద్దలు ఆ తర్వాత ఎందుకు మాట్లాడలేదని ఆమె ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు పంపిన సరే తాను ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానని అందుకే పార్టీ పెట్టానని కవిత చెప్పారు.

## సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

**-అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**- జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)ఆగస్టు 31.** :

హైదరాబాద్: సరోజినీ దేవి కంటి ఆసుపత్రిని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ సందర్శించి ఆసుపత్రిలోని వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సాంబ శివ రెడ్డితో ప్రత్యేకంగా ఇంటరాక్ట్ అయి ఆసుపత్రిలోని పరిస్థితులను తెలుసుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు కంటి వైద్యం కోసం సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి వస్తున్నారని కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటం ఆందోళనకరమైన విషయం అని ఆయన అన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమని, వైద్యుల కొరత, సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లోపాల కారణంగా రోగులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రజలకు వైద్యం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సంఖ్యలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని నియమించడంతో పాటు ఆధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి" అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం సాధ్యం కాదని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులపై సమగ్ర పరిశీలన నిర్వహించి లోటుపాట్లను వెంటనే పరిష్కరించాలని జై స్వరాజ్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ నాయకులు జనగాం వెంకటేష్ గౌడ్, నాగమణి, నర్రి నర్సింహా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం

**వేముల లక్ష్మణ్ జాతీయ అధ్యక్షులు ఆధ్వర్యంలో సోమవారం విముక్తా జాతి దినోత్సవం డి.ఎన్.టి ఈ సందర్భంగా చిత్తారమ్మ పెద్దమ్మ టెంపుల్ దగ్గర అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ముఖ్య కార్యాలయం దగ్గర, వడ్డెర కుల జెండా ఎగరేసి డిఎన్టిలో కలిపినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)ఆగస్టు 31.** బోరబండ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ తెలుపుతూ సంబరాలు జరుపుకున్నాము భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం దీనిని అధికారికంగా జరుపుతుంది, దీన్ని భారతదేశం అంతటా జరుపుకుంటారు బ్రిటిష్ వలస పాలకుల అమలు చేసిన, మొత్తం






సమాజాలను అన్యాయంగా పుట్టుకతో నేరస్తులుగా ముద్ర వేసిన 1871 నాటి అణచివేత క్రిమినల్ చట్టాన్ని రద్దు చేసిన వార్షికోత్సవం ఇది సూచిస్తుంది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేముల లక్ష్మణ్ జాతీయ అధ్యక్షులు అఖిలభారత వడ్డెర సంఘం పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వేముల తిరుమల దేవి వేముల శ్రీనివాస్ వేముల వీరేశం ఆలకుంట్ల శైలేందర్ బండర్ యాదయ్య వేముల సత్యం వరికుప్పల శ్రీనివాస్ వేముల శ్రీనివాస్ మొక్కల శ్రీనివాస్ మక్కల గోపినాథ్ దండుగుల సమ్మయ్య పిట్ల వీరస్వామి వల్లపు సారంగపాణి వల్లపు వెంకటేష్ మహేష్ బి వెంకటేశ్వర్లు ఉమా పద్మ బల్లపు వెంకటేష్ ఎత్తిరి కృష్ణ కుంచాల వేణు ఆలకుంట్ల గోపి ఉప్పల శ్రీనివాస్ వేణు నాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు అందరూ స్థానిక ప్రజలు పాల్గొని జయప్రదం చేశారు

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు

**రామగిరి,(వార్త సంధ్య)ఆగస్టు 31.** రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు సోమవారం గ్రామంలో జరిగిన పలు శుభకార్యాలు,కార్యక్రమాల్లో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు



తెలిపారు. ఈ సందర్భంగా పానుగంటి వీరేశం--శైలజ దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అలాగే గ్రామ పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు--శిరీష దంపతుల కుమార్తెల కర్ణవేదన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.అనంతరం ముక్కెర సారథి--విజయ దంపతుల ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సెంటినరీ కాలనీలోని తెలంగాణ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పల్లె తిరుమలరావు,పబ్బ రాజమౌళి,సందవేన కుమార్,నగునూరి శ్రీనివాస్,పానుగంటి ప్రశాంత్,జంగేటి కుమార్,మోత్కూరి వెంకన్న గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# 33 జిల్లాల కుమ్మరి వృత్తిదారుల సమస్యలపై కేవీఐసీ డైరెక్టర్‌కు టీఆర్‌కేఎస్ గర్జన!

**-వృత్తిదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.**

**- కేవీఐసీ ద్వారా పరికరాలు, శిక్షణ, సబ్సిడీ రుణాలు పెంచాలని డిమాండ్**



**హైదరాబాద్,: ఆగస్టు -31, (,వార్త సంధ్య )** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల సమస్యలను ప్రభుత్వం, కేవీఐసీ దృష్టికి తీసుకెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం (౦=ఖు) రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు గారి నాయకత్వంలో ప్రతినిధి బృందం సోమవారం ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ (ఖ౦×జ) డైరెక్టర్ మనోజ్ లంక గారిని కలిసి 33 జిల్లాల కుమ్మరి వృత్తిదారుల సమస్యలపై సమగ్ర నివేదికను అందజేసింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో కుమ్మరి కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులు నేటికీ అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంప్రదాయంగా కొనసాగుతున్న కుమ్మరి వృత్తిని ఆధునికీకరించి, వృత్తిదారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేవీఐసీ ద్వారా మరింత విస్తృత స్థాయిలో సహాయం అందించాలని కోరారు.ఎలక్ట్రికల్ వీల్స్ సంఖ్యను భారీగా పెంచాలి కేవీఐసీ ద్వారా ప్రతి సంవత్సరం అందిస్తున్న ఎలక్ట్రికల్ వీల్స్ సంఖ్య 33 జిల్లాలకు ఏమాత్రం సరిపోవడం లేదని ప్రతినిధులు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అందిస్తున్న సంఖ్యను పెంచి ప్రతి సంవత్సరం కనీసం 1,000 మంది అర్హులైన కుమ్మరి వృత్తిదారులకు ఎలక్ట్రికల్ వీల్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే అందించే ఎలక్ట్రికల్ వీల్స్ నాణ్యమైనవి, మన్నికైనవి, వృత్తిదారులకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని కోరారు. కేవలం ఒక ఎలక్ట్రికల్ వీల్ ఇవ్వడం కాకుండా, ఒక్కో లబ్ధిదారుడికి పగ్ మిల్, బ్లెండర్ తదితర అవసరమైన ఆధునిక పరికరాలతో కలిపి కనీసం రూ.1 లక్ష విలువైన యంత్రసామగ్రి అందించాలని కోరారు.అర్హులైన పేద వృత్తిదారులకే ప్రభుత్వ పరికరాలు అందాలి ప్రభుత్వం, కేవీఐసీ ద్వారా అందించే పరికరాలు నిజమైన కుమ్మరి వృత్తిదారులకు చేరేలా పారదర్శక విధానం రూపొందించాలని నాయకులు కోరారు. ఆర్థికంగా వెనుకబడిన, కులవృత్తినే జీవనాధారంగా చేసుకున్న కుటుంబాలను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ పరికరాలను రాష్ట్ర కుమ్మరి సంఘం ప్రతినిధుల సమన్వయంతో, సంబంధిత అధికారుల పర్యవేక్షణలో నిజమైన అర్హులను గుర్తించి అందిస్తే పథకాల సద్వినియోగం మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు.ట్రైనింగ్‌కు వచ్చే వృత్తిదారులకు రోజుకు రూ.500 ఇవ్వాలి కుమ్మరి వృత్తిదారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చే సమయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి శిక్షణా కేంద్రాలకు వచ్చేవారికి ప్రయాణం, భోజనం తదితర ఖర్చులు భారంగా మారుతున్నాయని తెలిపారు. అందువల్ల ట్రైనింగ్ సమయంలో ప్రతి శిక్షణార్థికి రోజుకు రూ.500 చొప్పున భోజనం, ప్రయాణం మరియు ఇతర అవసరాల కోసం ప్రోత్సాహక భత్యం అందించాలని కోరారు.దీంతో గ్రామీణ ప్రాంతాల వృత్తిదారులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి శిక్షణలో పాల్గొని ఆధునిక పద్ధతులను నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృత్తిదారుల సొంత స్థలాల్లో షెడ్లు నిర్మించాలి కుమ్మరి వృత్తిదారులు తమ ఇళ్ల పరిసరాల్లో స్థలాభావంతో వృత్తి నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు వివరించారు. అందువల్ల వృత్తిదారులకు ఉన్న సొంత ఖాళీ స్థలాల్లో షెడ్లు నిర్మించుకునేందుకు కేవీఐసీ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అదేవిధంగా ఆధునిక మట్టి పాత్రల తయారీ పరికరాలు, యంత్రాలు కొనుగోలు చేసేందుకు వ్యక్తిగత సబ్సిడీ రుణాలు అందించి కుమ్మరి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.33 జిల్లాల నుంచి వృత్తిదారులకు అధునాతన శిక్షణ తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి కనీసం 10 మంది వృత్తిదారులను ఎంపిక చేసి ఇతర రాష్ట్రాల్లో అధునాతన మట్టి పాత్రల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇప్పించే విధంగా కేవీఐసీ చొరవ తీసుకోవాలని కోరారు.ఇతర రాష్ట్రాల్లో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాలు, కొత్త డిజైన్లు, తయారీ పద్ధతులు, మార్కెటింగ్ విధానాలపై శిక్షణ అందించడం ద్వారా తెలంగాణ కుమ్మరి వృత్తిదారులు పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు.33 జిల్లాల కుమ్మరి వృత్తిదారుల సమస్యలను సమగ్రంగా వివరిస్తూ రూపొందించిన నివేదికను కేవీఐసీ డైరెక్టర్ మనోజ్ లంక గారికి అందజేశారు. వృత్తిదారుల సమస్యలను, సంఘం ప్రతిపాదనలను డైరెక్టర్ గారు సానుకూలంగా విని, వాటిపై సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.కుమ్మరి కులవృత్తిని కేవలం సంప్రదాయ వృత్తిగా కాకుండా ఆధునిక స్వయం ఉపాధి రంగంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ౦=ఖు నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి నాగపురి నగేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జిల్లాల శంకరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీరన్న, వృత్తిదారుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధరి జంగయ్యతో పాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు. "కుమ్మరి వృత్తిదారుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం.. 33 జిల్లాల సమస్యలకు పరిష్కారం వచ్చే వరకు టీఆర్‌కేఎస్ ఉద్యమం కొనసాగుతుంది" అని సంఘం నాయకులు స్పష్టం చేశారు.

# విద్య వైద్యం పై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

**ప్రభుత్వాల విధానాలతో విద్యలోనూ అసమానతలు**

**-- ఈ రెండు పూర్తిగా ప్రభుత్వరంగంలో ఉండాలి -- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**




**వార్తా సంధ్యా కూకట్‌పల్లి :** నాణ్యమైన విద్య వైద్యాన్ని ప్రతి ఒక్కరికి అందించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రగతి నగర్ లోని లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్ లో ఆదివారం సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "విద్యాహక్కు – ప్రభుత్వాల బాధ్యత" అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వాల విధానాలతో పేద, ధనిక వర్గాల మధ్య విద్యలో కూడా అసమానతలు ఏర్పడుతున్నాయన్నారు. కాబట్టి విద్య వైద్య రంగాలు పూర్తిగా ప్రభుత్వ రంగంలో ఉండాలని డిమాండ్ చేశారు. ఈ రెండు రంగాల్లోని కార్పొరేట్ శక్తులు నేడు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగాయన్నారు. వీటిని ప్రైవేట్ పరం చేయడం వల్ల కార్పొరేట్ శక్తులు వేలకోట్ల రూపాయలు దోచుకునేందుకు ప్రభుత్వమే అవకాశం కల్పిస్తుందని విమర్శించారు. విద్యపై 15 శాతం వెచ్చిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది శాతం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. కొఠారి కమిషన్ నివేదిక ఆధారంగా ఆరు శాతం ఖర్చు పెట్టాల్సిన కేంద్రం మూడు శాతం కూడా దాటడం లేదన్నారు. దీంతో పేద, ధనిక వర్గాల మధ్య అన్ని రకాల వ్యత్యాసాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా గ్రామపంచాయతీలో ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలో జూనియర్, నియోజకవర్గంలో డిగ్రీ, జిల్లాలో పీజీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు భిన్నంగా ఎనిమిది వేల పాఠశాలల మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం, లక్ష పాఠశాలల మూసివేతకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నాయని ఆవేదన విమర్శించారు. ప్రభుత్వాలు విద్య రంగం నుండి తప్పుకోవడం వల్లనే నిరుద్యోగం, పేదరికం, డ్రాప్ అవుట్ లు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు ఇల్లు కూడా లేదని, దేశంలో కేవలం 300 కుటుంబాలకు 25 లక్షల కోట్ల సంపద ఉందన్నారు. ఇలా సంపద పోగు చేసుకోవడమే దేశంలో పేదరికానికి కారణమవుతుందన్నారు. వారిపై రెండు శాతం పన్నులు పెంచితే అందరికీ ప్రభుత్వమే విద్యా వైద్యం ఉచితంగా అందించవచ్చన్నారు. నేటి ప్రభుత్వాలు పేదలకు వ్యతిరేకంగా కార్పొరేట్, ధనిక, భూస్వాములకు అనుకూలంగా వ్యవహరించి వారికి కోట్లాది రూపాయల రాయితీలు ఇస్తున్నాయన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం లేదని తరగతి గదులు లేవని ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతుల కల్పనను మరిచిపోయాయన్నారు. పాఠశాలలు సందర్శించే వారిపై దాడులు చేసే నీచ సంస్కృతికి బిజెపి దిగజారిందని విమర్శించారు. ఉచిత విద్య అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రికి విన్నవించామని కానీ ఎలాంటి స్పందన లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, దేశ సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ సిపిఎం నిర్వహించబోయే రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో ప్రజలు బాధ్యతగా భారీ సంఖ్యలో పాల్గొనాలని జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపి) ద్వారా దేశానికి నష్టమే ఎక్కువ జరుగుతుందన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టం పేరుతో దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ స్టాటిస్టికల్ సర్వే నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ చదువుకున్న కొద్దీ నిరుద్యోగం పెరుగుతుంది అన్నారు. తద్వారా మహిళల్లో చాలామంది చదువుకోవడం మానేస్తున్న పరిస్థితి దాపురించిందన్నారు. దేశంలో 8.75 శాతం యువత చదువు, శిక్షణ, ఉపాధి రంగాల్లో లేకుండా ఖాళీగా ఉన్నారని నీతి ఆయోగ్ నివేదిక కేంద్రం తీరుకు అద్దం పడుతుందన్నారు. 2035 నాటికి ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జిఈఆర్) 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం ఇందుకు ఒకేషనల్, ఆన్ లైన్, డిస్టెన్స్ విద్యా పద్ధతులను ఎంచుకుందన్నారు. దీంతో తరగతి గదిలో మాదిరి నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదన్నారు. ఇది కేవలం విద్యాసంస్థల సంపాదనకు ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఒకేషనల్ విద్యలో చేతివృత్తులను చేర్చడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలను తిరిగి అదే వృత్తులకు పరిమితం చేయడం లక్ష్యంగా కనిపిస్తుందన్నారు. జాతీయ భాష హిందీ తో పాటు మాతృభాషలు మాత్రమే నేర్చుకోవాలని చెప్పిన ఎన్ఈపీ తో అందరికీ ఇంగ్లీషు విద్యను దూరం చేసేందుకు కేంద్రం సిద్ధమైందన్నారు. కళాశాలలకు స్వయం ప్రతిపత్తిని ఇవ్వడం ద్వారా వాటిని యూనివర్సిటీ పరిధిలో నుండి తప్పించేందుకు చూస్తున్నారన్నారు. తద్వారా కళాశాలలో మార్కెట్ డిమాండ్ కు అనుకూలమైన కోర్సులను ప్రవేశపెట్టి వారి వ్యాపారాన్ని మరింత పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయన్నారు. తద్వార దేశ భవితవ్యం అయోమయ స్థితిలోకి నిట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి విద్యా వ్యవస్థను తద్వారా భారత భవిష్యత్తును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అంతకుముందు విద్యా ప్రాధాన్యతను తెలుపుతూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింప చేశాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రవి, శ్రీనివాస్, అశోక్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఏకత విరుద్ధ కథ




'అందరూ ఆచరణలో నిమగ్న మయ్యే ఉంటారు. కానీ ఆలోచనలూ మాటలే వారిననుసరించవు" అని అంటా రొక కవి. ఇది తిరగేసి వ్యంగ్యంగా చెప్పిన మాట. అంటే, చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదని అర్థం. మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుందనేది ఎప్పటినుంచో మనకు తెలిసిన విషయమే. అందుకే అంటారు, 'మాటలు కోటలు దాటుతాయి, కాని చేతలు గడపలు దాటవు అని.' 'వట్టి మాటలు కట్టి పెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న గురజాడ గీతం ఇలాంటి వారిని చూసే రాసుంటారు. అయితే చెప్పే మాటల ప్రకారం చేయకపోతే పోనీ, చెప్పినదానికి విరుద్ధంగా, పూర్తి వ్యతిరేకంగా చేస్తున్న వారి గురించి జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. అదేమంటే, 'సార్వత్రిక ఏకతా ఉత్సవాల' పేరుతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్వహిస్తున్న సభలు నేడు అమెరికా దేశపు న్యూయార్క్ సిటీలోనూ ఏర్పాటు చేస్తున్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29 న జరిగే ఈ సభలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగిస్తున్నారు. సార్వత్రిక ఏకతా ఉత్సవమని దానికి పేరుపెట్టటం మరీ విడ్డూరంగా ఉంది. అయితే వారి ఏకత కేవలం మతపరమైన ఏకతకు సంబంధించింది కావచ్చు. వీళ్లు అసలు మనుషుల ఐక్యతను ఎప్పుడూ కోరుకోరు. వీరి సిద్ధాంతంలోనే విభజన, విద్వేషం ఉంటుంది. ఐక్యత, ఏకత అనే మాటలకే పూర్తి విరుద్ధమైన ఆచరణ వాళ్లది. అట్లాంటి వాళ్లు సార్వత్రిక ఏకత కోసం ఉత్సవం చేస్తున్నారు. సరే వారి అర్థంలో విద్వేషాలను, విభజనను వెళ్లగక్కటానికి కావలసిన ఏకత కోసం ఈ పాట్లన్నీ పడుతున్నారు. కాబట్టే ఏ మాటల వెనుక ఏ అర్థాలు దాగున్నాయో తెలుసుకోనంతవరకు మోసపోతూనే ఉంటాం. ఇప్పుడు ముసుగేసుకున్న ఆ సంఘ్ ఏర్పడి వందేండ్లు నిండిన సందర్భంగా ప్రపంచంలోనూ తమ గళాన్ని, గరళాన్ని చిందించే క్రమంలో ఏర్పాటు చేసుకున్నదే న్యూయార్క్‌లో భగవత్ ప్రసంగ సభ. భారతదేశం నుంచి వీళ్లు పోయి అక్కడ చెప్పేదేమిటి?ఈ దేశపు సాంస్కృతిక జీవన విధానాన్ని ఏమైనా ప్రతిబింబిస్తారా?ప్రపంచంలోని ప్రజలకు వీళ్లు వినిపించే సందేశం ఏమిటి? న్యూయార్క్‌లో ఉన్న ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు వీళ్ల విషయాలన్నీ తెలుసు. అందుకే 'మోహన్ భగవత్ ఇక్కడ సభ పెట్టటాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం' అని ప్రదర్శన తీశారు. వాళ్లింకా ఏమన్నారంటే, మహాత్మా గాంధీని చంపిన వారసులు వీళ్లు, వీళ్ల సభను జరగనివ్వమని నినదించారు. అంతే కాదు, వేలాది మందిని చంపిన యుద్ధ పిపాసి, ఫాసిస్టు హిట్లర్ వీరికి ఆదర్శం. అటువంటి సంఘ్ శక్తులకు అవకాశం ఇవ్వవద్దని ధర్నా నిర్వహించారు. హిందూ మతతత్వ శక్తులకు ఇక్కడ చోటులేదని పెద్దఎత్తున మాడిసన్ వీధులలో ప్రదర్శనలు తీశారు. వాళ్లంతా హిందూ సమూహాలే కావడం విశేషం. ఇక న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దాని కూడా తాను ఈ కార్యక్రమానికి మద్దతివ్వటం లేదని ప్రకటించారు. అయితే అదొక ప్రైవేటు కార్యక్రమం కావడం వల్ల దాన్ని రద్దుచేసే అధికార పరిధి నగర ప్రభుత్వానికి ఉందా అన్నది వేరే ప్రశ్న అని ఆయన పేర్కొన్నారు. కానీ ఆరెస్సెస్ గురించిన తన అభిప్రాయాలను బహిరంగంగానే వ్యక్తం చేశారు. మమ్దాని గుజరాత్ రాష్ట్ర వారసత్వం కలిగినవారు. భారతదేశానికి సంబంధించిన అవగాహన ఉన్నవాడు. ఆయన ఏమన్నారంటే, 'తన కుటుంబం తనకు నేర్పిన భారతదేశం, తాను పెరిగిన భారతదేశం "బహుళత్వ సమాజం, లౌకిక గణతంత్రం" అని, భారతదేశానికి చెందిన ప్రతి వ్యక్తికీ ఆ దేశంలో తనదైన స్థానం, హక్కు, గౌరవం ఉందనే భావనతో తాను పెరిగానని చెప్పారు. ఒక దేశం ఎవరిది? అనే ప్రశ్నకు సమాధానం ఒకే మతం, ఒకే వర్గం, ఒకే గుర్తింపుగా మారకూడదని, ఏ దేశాన్నయినా ఇతరులను వెలివేసే, పక్కనపెట్టే దృక్పథంతో చూడటం తనకు ఆందోళన కలిగించే విషయమని, అందుకే ఆరెస్సెస్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. మమ్దాని వ్యాఖ్యలు మొత్తం సంఘ్ భావజాలంపై చేసినవి. అనేక మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశాన్ని గుర్తుచేసి, దేశపు బలాన్ని స్పష్టం చేశారు. మమ్దాని చేసిన వ్యాఖ్యలు ఆరెస్సెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. అంతేకాక సంఘ్ ఆలోచనలతో నడుస్తున్న దేశంలో ప్రభుత్వ విధానాల అసహ్యతనూ ఎత్తిచూపింది. మేయర్ జొహ్రాన్ అనుభవంలోని భారతదేశాన్ని, దాని స్వరూపాన్ని, స్వభావాన్ని మార్చే ప్రయత్నం ఇప్పుడు జరుగుతున్నది. దేశ వారసత్వ సంపద అయిన లౌకికత్వాన్ని తొలగించి, దేశం కేవలం హిందూత్వ రాష్ట్రంగా మలచే ప్రయత్నం చేస్తున్నారు. బహుళ సంస్కృతులను, భిన్నత్వాలను ఏకత పేరుతో నిరాకరించడం, ప్రపంచం ముందు భారత దేశాన్ని ఒక మతతత్వ దేశంగా చూపెట్టడానికి, దిగజార్చడానికి ఆరెస్సెస్ కృషి చేస్తున్నది. ప్రపంచ దేశాలకి ఈ చర్యల పట్ల తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. ఏకత పేరుతో అప్రజాస్వామిక, నిరంకుశ, ద్వేష ప్రచారం వమ్ముకాక తప్పదు.

# హిమాలయమాల్లో వాటర్ బాంబ్స్ !

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు మరోసారి హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సులపై ఆందోళనలను పెంచాయి. ముఖ్యంగా భారత్ ఎగువన హిమాలయాల్లో హిమానీ నదాల పరిస్థితిపై ఆందోళన కలుగుతోంది. మనదేశంలో అలాంటి ఉపద్రవమే జరిగితే పలు రాష్ట్రాలు కొట్టుకుపోక తప్పదు. హిమానీనదాల కరిగే పక్రియలో ఏర్పడే సరస్సుల్లో భారీ మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. వీటిని నియంత్రించే సహజ మంచు, రాళ్ల లేదా మట్టి అడ్డంకులు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది. భారీ వర్షాలు, హిమానీనదాల కరుగుదల, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు వంటి కారణాలతో సరస్సు అడ్డంకులు తెగిపోతే దిగువ ప్రాంతాలకు ఒక్కసారిగా భారీగా నీరు, బురద, రాళ్లు, మట్టి కొట్టుకురావచ్చు. అందుకే ప్రమాదకర హిమానీనద సరస్సులను నిపుణులు కొన్నిసార్లు 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తారు. నేపాల్‌లో జరిగిన వరదలు హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు ఎంత వేగంగా భారీ విపత్తులుగా మారగలవో మరోసారి చూపిస్తున్నాయి. ముఖ్యంగా హిమానీనద సరస్సుల సంఖ్య, వాటి నీటి నిల్వ సామర్థ్యం, వాతావరణ మార్పుల ప్రభావం, పర్వత ప్రాంతాల్లో పెరుగుతున్న నిర్మాణాలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. హిమాలయాల్లోని హిమానీనద సరస్సుల ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేస్తే, పర్వత ప్రాంతాలతో పాటు దిగువ మైదాన ప్రాంతాల్లోనూ భారీ వరదలు సంభవించే అవకాశం ఉంది. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ఉపగ్రహ పర్యవేక్షణ, ప్రమాద మ్యాపింగ్, శాస్త్రీయ ఇంజనీరింగ్ చర్యలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమానీనదం విస్ఫోటనం కారణంగా భోటేకోశి, త్రిశూలి నదుల్లో భారీగా వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు, టిబెట్‌లో నదీ మూల ప్రాంతానికి సమీపంలో కొత్తగా తాత్కాలిక సరస్సు ఏర్పడటంతో భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. నేపాల్‌లో జరిగిన ఈ ఘటనతో ఇప్పుడు భారత హిమాలయ ప్రాంతాల్లో ఉన్న హిమానీనద సరస్సుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సీనియర్ సలహాదారు ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28,000 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారతదేశంలోనే ఉన్నట్లు



అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే వీటిలో కొన్ని సరస్సులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్న సరస్సులుగా గుర్తించినట్లు సమాచారం. నేపాల్‌లోని ఘటనలో సహజ పరిస్థితులతో పాటు మానవ కార్యకలాపాలు కూడా నష్టాన్ని పెంచినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. టిబెట్, నేపాల్‌లోని పర్వత ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం, నదుల సహజ ప్రవాహ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పడటం వంటి కారణాలు ప్రమాద తీవ్రతను పెంచే అవకాశం ఉంది. అదేవిధంగా, ఇజీస చిజీసనితినిణ ఃూబబిıప (ఇచా) సకాలంలో పనిచేయకపోతే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు తగినంత సమయం లభించదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. భారత హిమాలయ ప్రాంతంలోని ప్రమాదకర హిమానీనద సరస్సులు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాలయ ప్రాంతాల్లోని సరస్సులు పొంగిపొర్లితే ప్రభావం కేవలం పర్వత ప్రాంతాలకే పరిమితం కాకపోవచ్చు. భారీ మొత్తంలో నీరు, మట్టి, రాళ్లు దిగువకు ప్రవహించి నదుల నీటిమట్టాన్ని ఒక్కసారిగా పెంచవచ్చు. ప్రత్యేకంగా నేపాల్ లేదా సిక్కిం ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తే కోసి, గండక్, తీస్తా వంటి నదుల ద్వారా నీరు దిగువ మైదాన ప్రాంతాలకు చేరే ప్రమాదం ఉంటుంది. దీంతో ఉత్తర బీహార్‌లోని సుపాల్, సహర్సా, మధుబని, చంపారన్ వంటి ప్రాంతాలు, అలాగే ఉత్తర బెంగాల్‌లోని జల్పైగురి, సిలిగురి, డార్జిలింగ్ టెరాయ్ ప్రాంతాల్లో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. ప్రమాదకర సరస్సులను పర్యవేక్షించేందుకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ధిక ప్రమాదం ఉన్న సరస్సుల చుట్టూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త నిర్మాణాలు, నివాసాలను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరస్సుల్లోని నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు చెక్‌డ్యామ్‌లు, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి మళ్లింపు నిర్మాణాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నారు.

అధిక ప్రమాదం ఉన్న సరస్సుల్లో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్లను ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉన్నాయి. నీటి మట్టం, ఉష్ణోగ్రత, ఇతర మార్పులను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా సరస్సుల పరిమాణం, నీటి మట్టం, పరిసర ప్రాంతాల్లో మార్పులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న హిమానీనద సరస్సుల వద్ద రాబోయే రెండేళ్లలో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైతే ఖాళీ చేయించడం సులభమవుతుంది.

# పెండింగ్ కేసులు... న్యాయవ్యవస్థకు సవాళ్లు!

ప్రజా ప్రతినిధులపై కేసులను త్వరగా తేల్చాలని భారత అత్యున్నత న్యాయస్థానం పదేపదే చెబుతోంది. 2017 నుండి అనేకమార్లు ఆదేశాలు జారీ చేసినా కేసుల పరిష్కారంలో వ్యవస్థ విఫలమవుతోంది. విచారణను పూర్తిచేయటంలో అసాధారణమైన జాప్యం, అభియోగాలను వేగంగా నమోదు చేయకపోవటమేకాక సాక్షులను కూడా సక్రమంగా విచారించడలేదని, పైగా విచారణను పదే పదే వాయిదాలు వేస్తూ పోతుండటం వలన నేరన్యాయ విచారణ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం దెబ్బతింటోందని సుప్రీం కోర్టులో అమికిస్ క్యూరీ (న్యాయ సహాయకులు) విజయ్ హన్సారియా అత్యున్నత న్యాయ స్థానానికి నివేదించిన విషయాన్ని పరిశీలిస్తే, న్యాయ వ్యవస్థ పరిశీలకులు సంక్షోభం కలిగిస్తుందని చెప్పక తప్పదు. ఆ నివేదికలో కేసులు త్వరగా పూర్తిచేయాలంటే సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులకు జారీచేసిన ఆదేశాలు సరిపోవేమోనని తన నివేదికలో వ్యాఖ్యానించారు. ఉదాహరణకు వేలాది స్థాయిలో కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని భావించాల్సి ఉంటుంది. దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులను శాశ్వతంగా రాజకీయాల నుండి నిషేధించాలని 2016 లో అశ్వని కుమార్ ఉపాధ్యాయ అనే న్యాయవాది సుప్రీంలో పిల్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందించింది. నేతలపై కేసులను త్వరగా తేల్చాలని హైకోర్టులను ఆదేశించింది. అయినప్పటికీ పెద్దగా మార్పేమీ లేనట్టుందని చెప్పేందుకు ఏళ్లు తరబడి సాగుతున్న విచారణలే నిదర్శనం. పైగా, ఎప్పుడు కావాలంటే అప్పుడు బెయిలు మంజూరు చేయుటం, తరచూ వాయిదాలు వేసే దోషాల తేలబడి కేసులు: సాగదీయటం వ్యవస్థ పట్ల ప్రజల్లో అసహనం, అనుమానం కలుగుతుందనే విషయాన్ని అమికిస్ క్యూరీ నివేదిక బలపరుస్తోందని చెప్పాలి. సామాన్యుల కేసులు బెయిల్ మీదరాకుండా పెండింగ్‌లో ఉండటంతో, వారు ఏళ్లతరబడి అండర్ ట్రయల్స్ జైళ్లలో మగ్గుతున్నారు. అనుభవించాల్సిన శిక్షకంటే కూడా ఎక్కువకాల సమయం జైళ్లలో మగ్గుతున్నారని, అయితే పలుకుబడి, ఇతర సామాజిక హంగు, ఆర్థిక, రాజకీయ పలుకుబడి కలిగివున్న కొందరి కేసులు తేల్చారే సరికి ఆయా కోర్టుల్లో బెంచ్ మీదకు రావటం బెయిలు, లేదా వాయిదాలు పొందటం లాంటి అంశాల తీరు ప్రజల మనస్సులో కోర్టుల ప్రతిష్ట ఇప్పటికే కొంత మసక బారిందని చెప్పాలి. అయితే అమికిస్ క్యూరీ హన్సారియా తన 22వ నివేదికలో ఏళ్లతరబడి న్యాయస్థానాల మొహమే చూడకుండా, వాయిదాలకు హాజరు కాకుండా ఉన్న వారి సంఖ్యా వివరాలు ఇవ్వక పోవటం కొంత అసంతృప్తి కలిగించిందని న్యాయ నిపుణులు కొందరు



వ్యాఖ్యానిస్తున్న విషయం గమ నార్హం. ప్రజాప్రతినిధులపై పెండింగ్‌లో ఉన్న కేసులు, తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ హన్సారియా సమర్పించిన నివేదికను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులపై 4,192 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం లోక్‌సభలోని సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు, 179 మందిపై తీవ్ర ఆరోపణల కేసులుండగా, 533 మంది రాజ్యసభ సభ్యుల్లో 75 మందిపై క్రిమినల్ కేసులు, 40 మందిపై తీవ్ర ఆరోపణల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే దేశంలో మొత్తం 4111 మంది శాసన సభ్యులు ఉండగా, వారిలో 2008 మందిపై క్రిమినల్ కేసులు, 1296 మందిపై తీవ్ర ఆరోపణల కేసులు ఉన్నాయని పేర్కొనడం జరిగింది. అలాగే ముఖ్యమంత్రుల కేసులను పరిశీలిస్తే, అత్యధికంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై 89 కేసులు పెండింగ్‌లో ఉండగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై 19 కేసులు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై 29 కేసులు, కర్ణాటక ముఖ్యమంత్రి డి కే శివకుమార్‌పై 19 కేసులు, నేటికీ అపరిష్కృతంగా ఉన్నాయని ఆ నివేదిక వెల్లడించింది. దీనింబట్టి సుప్రీంకోర్టు ఆదేశాలను భేఖాతరు చేస్తూ వివిధ కోర్టులు చేస్తున్న ఆలస్యాన్ని తెలియజేస్తోంది. పైగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మొత్తం 25 మంది పార్లమెంట్ సభ్యుల్లో 13 మంది పై క్రిమినల్, మరో 9 మందిపై తీవ్రమైన కేసులుండగా మిగిలిన ముగ్గురిపై అసలు కేసులేమీ లేవు. అలాగే ఆంధ్రప్రదేశ్ కే చెందిన 175 మంది శాసన సభ్యుల్లో అత్యధిక మందిపై కేసులు పెండింగ్ లోవున్నట్లు సమాచారం. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఉన్న కేసుల్లో నిందితులు పదవుల్లో ఉన్నప్పుడు అసాధారణ ఆలస్యం జరుగుతుండటం ఈ జాప్యం వలనే నిందితులకు అనుకూలంగా మారి కేసులు బలహీనపడటం కేసులు నీరు కారిపోవడం జరుగుతున్నాయని అందరికి తెలిసిన విషయమే. 2025 ఏడాది చివరి నాటికి భారత న్యాయ వ్యవస్థలో మొత్తం 5,09,34,126 కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వీటిలో సివిల్ కేసులు 1.12 కోట్లు కాగా, మిగతా వాటిలో 3.96 కోట్లు క్రిమినల్ కేసలని నేషనల్ జుడీషియల్ డేటా గ్రిడ్ గణాంకాలు వెల్లడించాయి. ఏడాదికి పైగా పెండింగలో ఉన్నవి 38 శాతం కాగా, 1-3 సంవత్సరాలకు పైగా 23 శాతం, 3-5 ఏళ్లపెండింగ్ కేసులు 13 శాతం, ఐదు నుండి 10 సంవత్సరాలు 17 శాతం కేసులు పెండింగ్‌లో ఉండగా, పదేళ్లకు పైబడిన కేసులు 9 శాతంగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఈ కేసుల్లో అత్యధికం ఆయా జిల్లా కోర్టుల్లోనే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో భూమి మరియు ఆస్తి వివాదాలకు సంబంధించిన కేసులే ఎక్కువ. పెండింగ్ కేసుల భారం న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిందని చెప్పాలి. ఈ కేసుల్నీ పరిష్కారం అవ్వాలంటే 324 ఏళ్లు పడుతుందని అంచనా! కేసు లు అపరిష్కృతంగా ఉండటానికి ప్రధాన కారణం ఏమంటే, న్యాయమూర్తుల ఖాళీలు, ప్రక్రియపరమైన జాప్యాలు, చాలినంత మౌలిక సదుపాయాలు లేకపోవటం, తరచూ బదిలీలు, సెలవులపై వెళ్లటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేకపోవటమే. మనదేశంలో ప్రతి పదిలక్షల జనాభాకి కేవలం 21 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ప్రజాస్వామ్యం దేశాల్లో ఈ సంఖ్య భారత్‌లో అత్యల్పం. ఈ నిష్పత్తి సంఖ్య పెంచాలని లా కమిషన్ ఆఫ్ ఇండియా పదే పదే చేసిన సిఫార్సులు అమలుకు నోచుకోకపోవడం కూడా కేసుల భారం పెరగడానికి మరొక కారణం. పైగా ప్రభుత్వ శాఖలే అతిపెద్ద వ్యాజ్యదారులుగా ఉండటం ఇంకొక కారణం. శ్రద్ధడి చూపుకు అనేక కారణాలున్నట్లు అన్ని కోట్లు కేసులు భారత న్యాయ స్థానాల్లో పేరుకు పోవటానికి, చట్టంలో లొసుగులు అంటే ఒక నేరస్తుడు పటకేసుల్లో కోర్టులకు వెళ్ళకుండా ఉన్న అవకాశాలను అడ్డం దిడ్డంగా వాడుకుంటూ ఎళ్ళతరబడి కోర్టుల మోహమే చూడకుంటే, దీన్ని రిఫరెన్స్‌గా తీసుకుని భవిష్యత్తులో ఫలానా కేసులో ఫలానా వారు ఈ ప్రకారం కేసులనుండి దూచ్చాలపాటు మినహాయింపు పొందిన విషయం వుదాహరించి తమ క్లయంటికి కూడా అదే మినహాయింపు ఇవ్వాలని ఉదహరిస్తే దానికి సమాధానం ఏమని చెప్పాలి. ఇలాంటి లొసుగులు సవరించి భారత న్యాయ కాడ్లంలో ని మౌలిక చట్టాలను కూడా మార్పు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# ఆదివాసి ఆడబిడ్డ ఉకే శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాడుదాం ..

**కల్తి రాంప్రసాద్**
**తుడుందెబ్బ రాష్ట్ర కోశాధికారి**
**"తుడుందెబ్బ"ఆదివాసి హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బచ్చల వెంకటేశ్వర్లు డిమాండ్**

**సింగరేణి ప్రతినిధి ,ఆగస్టు 31(వార్త సంధ్య )**
ఆదివాసి కుటుంబంలో జన్మించి, కష్టపడి చదువుకొని, కుటుంబానికి అండగా నిలవాలనే ఆశయంతో ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టిన ఒక ఆదివాసి ఆడబిడ్డ జీవితం అర్ధాంతరంగా ముగియడం అత్యంత బాధాకరమని ఆదివాసి హక్కుల పోరాట సమితి -- తుడుందెబ్బ ఖమ్మం జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఉకే శిరీష మృతికి సంబంధించిన పూర్తి నిజాలను బయటపెట్టి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆదివాసి సమాజం మొత్తం కలిసికట్టుగా పోరాడాలని ఖమ్మం జిల్లా తుడుందెబ్బ అధ్యక్షులు బచ్చల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగర పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో గల ప్రైమ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఉకే శిరీష అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం ఆదివాసి సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ఎవరి ప్రభావానికీ లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనలో షానాద్ ఉల్లా ఖాన్ అనే వ్యక్తి ప్రమేయంపై ఆరోపణలు వస్తున్నాయని, ఈ ఆరోపణలతో పాటు ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. శిరీష మృతికి సంబంధించిన నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్న నేపథ్యంలో, పోలీసు అధికారులు కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను నిష్పక్షపాతంగా పరిశీలించి నిజాలను బయటపెట్టాలని కోరారు. ఒక ఆదివాసి కుటుంబం తమ కూతురిని చదివించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఎన్నో కలలు కంటుందని, కానీ ఆ కుటుంబం చివరకు తమ బిడ్డ మృతిపై న్యాయం కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం అత్యంత విషాదకరమన్నారు. శిరీష మృతి కేవలం ఒక కుటుంబానికి జరిగిన నష్టం కాదని, ఆదివాసి సమాజం మొత్తం గుండెను కలిచివేసిన ఘటన అని పేర్కొన్నారు. ఆదివాసి ఆడబిడ్డలకు ఎక్కడ భద్రత ఉందనే ప్రశ్నకు ఈ ఘటన సమాధానం చెప్పాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తున్న మహిళలు కూడా తమ భద్రతపై భయపడే పరిస్థితులు ఏర్పడకూడదని అన్నారు. ఒక యువతి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు నిజాలను పూర్తిగా బయటపెట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా, పోలీసు యంత్రాంగంపైనా ఉందన్నారు. శిరీష కుటుంబ సభ్యులు న్యాయం కోసం




ఎదురుచూస్తున్న ఈ సమయంలో యావత్ ఆదివాసి సమాజం వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక కుటుంబం ఒంటరిగా న్యాయం కోసం పోరాడితే వారి గొంతు బలహీనంగా మారవచ్చని, కానీ ఆదివాసి సమాజం మొత్తం ఏకమై నిలబడితే అన్యాయంపై బలమైన పోరాటం చేయవచ్చన్నారు. ఉకే శిరీష మృతికి సంబంధించి ఎలాంటి వాస్తవాలు దాచిపెట్టకుండా, అన్ని కోణాల్లో విచారణ జరిపి, చట్టపరంగా బాధ్యులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తుడుందెబ్బ ఆదివాసి హక్కుల పోరాట సమితి వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. 'ఆదివాసి ఆడబిడ్డ ఉకే శిరీషకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఈ న్యాయ పోరాటంలో ఆదివాసి సమాజం, ప్రజాసంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు అందరూ భాగస్వాములు కావాలి. శిరీష కుటుంబం ఒంటరిది కాదు... యావత్ ఆదివాసి సమాజం వారికి అండగా ఉంటుంది" అని పేర్కొన్నారు. ఉకే శిరీషకు న్యాయం చేయాలి... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి... ఆదివాసి ఆడబిడ్డల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి... అని తుడుందెబ్బ ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

# మలబార్‌లో 'నైరా' కలెక్షన్ ఆవిష్కరించిన నటి శ్రీనిధి శెట్టి




**హైదరాబాద్, ఆగస్టు 31(వార్త సంధ్య )**
మలబార్ గోల్డ్, డైమండ్స్ సహజ రత్నాలతో రూపొందించిన నూతన ఆభరణాల కలెక్షన్ 'నైరా'ను హైదరాబాద్‌లో నటి, మోడల్ శ్రీనిధి శెట్టి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ.అహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో జరుగుతున్న జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్లో భాగంగా ఈ కలెక్షన్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 14 వరకు రత్నాభరణాలు, అన్‌కట్ జ్యువెలరీపై తయారీ ఛార్జీల్లో 25 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సాంప్రదాయ చిల్లై, పచ్చి కళతో స్ఫూర్తి పొందిన 'నైరా'లో బంగారం, సహజ రత్నాలను ఆధునిక డిజైన్లతో మేళవించినట్లు తెలిపారు. సహజ రత్నాలకు ఆధునిక డిజైన్, కళాత్మకతను జోడించడమే 'నైరా' లక్ష్యమని అన్నారు.

# ఉచిత దుస్తుల పంపిణీ..



**ఆగస్టు 31(వార్త సంధ్య )మల్లాపూర్ ఆగస్టు 31:**
మల్లాపూర్ మండలం లో ని హుస్సేన్ నగర్ గ్రామంలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందజేసిన ఉచిత దుస్తులను సోమవారం సర్పంచ్ హైదర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ హైదర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఉచిత దుస్తుల పంపిణీతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, ప్రవీణ,కీర్తన విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలు,టీపిసిసి దుద్దిళ్ల శ్రీను బాబు సూచనలతో నిరసనలు

**-రామగిరి మండలం బేగంపేట ఎక్స్ రోడ్‌లో నల్ల బ్యాడ్జీలతో భారీ నిరసన**
**-రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని,ఉత్తరాఖండ్ బీజేపీ నేతలపై కేసు నమోదు చేయాలని డిమాండ్**
**-సోనియా గాంధీ,దుద్దిళ్ల కుటుంబాల త్యాగాలను స్మరించుకున్న కాంగ్రెస్ శ్రేణులు**
**- కేంద్రలో బీజేపీకి నూకలు చెల్లాయి.. రాహుల్ గాంధీ భావి భారత ప్రధాని కావడం ఖాయం**



**రామగిరి, ఆగస్టు 31(వార్త సంధ్య )**
దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ కుట్రపూరితంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను నిరసిస్తూ రామగిరి మండలంలో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి.తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకురామగిరి మండలం బేగంపేట ఎక్స్ రోడ్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్తరాఖండ్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ కార్యకర్తలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.?ఈ నిరసన కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని అణగదొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని,"బంతిని గోడకేసి కొడితే ఎంత వేగంగా దూసుకొస్తుందో.. కాంగ్రెస్ పార్టీ రియాక్షన్ కూడా అంతే తీవ్రంగా ఉంటుంది" అని బీజేపీ నేతలను హెచ్చరించారు.దేశం కోసం,తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలను తిరుపతి యాదవ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.దేశ అత్యున్నత పదవి అయిన ప్రధానమంత్రి సీటును సైతం త్యాగం చేసిన ఘనత సోనియా గాంధీదని కొనియాడారు.ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా,తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం కోసం సొంత పార్టీని సైతం పణంగా పెట్టి సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని,ఆమెకు ప్రజలంతా రుణపడి ఉంటారని అన్నారు.?అదేవిధంగా మంథని నియోజకవర్గంలో దుద్దిళ్ల కుటుంబం చేసిన సేవలను ఆయన ప్రశంసించారు.దివంగత శ్రీపాదరావు ప్రాణత్యాగం మొదలుకొని,నేడు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తీరును వివరించారు. దేశ ప్రజలు బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తున్నారని,ఆ ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయన్నారు.ఒకనాడు మంథని నుంచి ఎంపీగా గెలిచిన పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా సేవలందించారని గుర్తుచేసిన ఆయన,భవిష్యత్తులో మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో పెద్దపల్లి జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసి,రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నదే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి,రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం,రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ అధ్యక్షులు కండె పోషం, మాజీ జడ్పీటీసీ మైదం వరప్రసాద్,మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,నాగేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య,సర్పంచ్ కొండవేనా దివ్య సుధాకర్,మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల ఓదెలు,రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్,యూత్ అధ్యక్షులు వేగోలపు సంతోష్,ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్,నవాబ్ పేట సర్పంచ్ రోడ్డ మౌనిక కుమార్,పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య, వీరగోని రమాదేవి శ్రీనివాస్,శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం డైరెక్టర్ నారెడ్ల శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోత్ ప్రవీణ్ కుమార్ , ఉపసర్పంచ్ యసం సతీష్,కావేటి మల్లేశ్వరి,మాజీ ఉప సర్పంచ్,వేగోలపు శ్రీనివాస్,మొగిలి నరేష్ యాదవ్,అట్టి తిరుపతిరెడ్డి,వేముల కనుకయ్య,మాజీ ఎంపీటీసీ మద్దెల భూమన్న కన్నూరి నర్సింగరావు,గ్రామ శాఖ అధ్యక్షులు తోగరి చంద్రయ్య,కాల్వ శీను ధర్మల వెంకటేష్,కల్వల శంకర్,రేండ్ల కృష్ణ మూర్తి, అయిందల కొమురయ్య,పెద్ది సమ్మయ్య ,జాగరి రజిత,కెక్కర్ల స్వరూప కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్లపల్లి రాజమల్లు,ఒర్రె సది, బర్ల శ్రీకాంత్,భోగే ప్రకాష్ కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన అధికారికి ఆత్మీయ సన్మానం



**రామగిరి,ఆగస్టు 31(వార్త సంధ్య )**
సోమవారం జి.ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన ఏరియా పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి నీ రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఏరియాలోని వివిధ గనుల, విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజారెడ్డి సింగరేణి సంస్థలో సుమారు 38 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు,విభాగాలలో,వివిధ హోదాలలో విధేయతతో,అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.అదేవిధంగా అడ్రియాల లాంగ్ వాల్ గని లో ప్రాజెక్ట్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తు పదవి విరమణ పొందిన టి.రఘురామ్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వివిధ గనుల,విభాగాల అధిపతులు ఘనంగా సన్మానించారు.వారు వివిధ హోదాలలో అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎం బండి సత్యనారాయణ,ఏరియా ఇంజినీర్ వి.దూప్ సింగ్,అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు బి.టి.మురళీకృష్ణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్ విభాగాధిపతులు కె.ఐలయ్య,అఫ్సర్ పాషా, ఆర్.రాజేశ్వరి,రవిచరణ్,షబ్బీరుద్దీన్,శ్రీహర్ష, యండి.ఆసిఫ్,మనోజ్ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌తో రైతులకు ఎరువుల బుకింగ్ సులభతరం

**మంథని, ఆగస్టు 31(వార్త సంధ్య )**
ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సులభతరం చేసేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన అన్ని రకాల ఎరువులను ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని మంథని మండల వ్యవసాయ అధికారి దాసరి నవ్య తెలిపారు. నమోదు చేసుకున్న రైతులకు 48 గంటల్లో ఎరువులు అందేలా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టాదారు రైతులతో పాటు మరణించిన పట్టాదారుల వారసత్వం నమోదు కాని భూములను సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు, అటవీ హక్కుల పట్టాలు కలిగిన వారు పోడు భూములు, దేవాదాయ శాఖ భూములు, ప్రభుత్వ, సంస్థలు, సామాజిక భూములు సాగు చేస్తున్న రైతులు కూడా ఈ విధానం ద్వారా ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఆధార్, ఫోన్ నంబర్ ధ్రువీకరణ అనంతరం భూమి వివరాలు నమోదు చేసేటప్పుడు సంబంధిత కేటగిరీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లో భూమి ఉన్న రైతులు, చట్టపరమైన వారసులు, యజమానులుగా ఉండి భూమి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నవీకరించబడని రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. భూమి వివరాలు నమోదు కాని రైతులు భూమిని




జోడించు ఎంపిక ద్వారా సాగు చేస్తున్న భూమి సర్వే నంబర్, విస్తీర్ణాన్ని నమోదు చేస్తే సంబంధిత వ్యవసాయ అధికారి పరిశీలనకు వెళ్తుందని తెలిపారు. అధికారి ఆమోదం పొందిన తర్వాత ఎరువులను నమోదు చేసుకుని పొందవచ్చన్నారు. రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువులు నమోదు చేసుకోవడంలో ఇబ్బందులు లేకుండా వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎరువుల విక్రయదారులు సహకరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని రైతులు ఎరువుల లభ్యతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దాసరి నవ్య పేర్కొన్నారు..

# కూకట్‌పల్లిలో "షీ డిజైనర్ స్టూడియో " ప్రారంభం

**- బండి రమేష్ దంపతుల శుభాకాంక్షలు**

**వార్త సంధ్య కూకట్‌పల్లి**
మహిళల అవసరాలకు మరియు ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా రూపుదిద్దుకున్న షీ డిజైనర్ స్టూడియో గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం సోమవారం కూకట్‌పల్లిలోని కెపిహెచ్‌బి ఐరిస్ బిల్డింగ్‌లో ఘనంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ



కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ మరియు శ్రీమతి బండి లకుమ దేవి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి స్టూడియోను లాంఛనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... మహిళలకు నూతన ఫ్యాషన్ అవసరాలకు తగ్గట్టుగా అత్యంత నాణ్యమైన డిజైనర్ వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. సంస్థ నిర్వాహకులకు తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ వ్యాపారం విజయవంతంగా కొనసాగి మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బాబు, శివ చౌదరి, రామారావు, రమణ, సంధ్య, కల్పనలతో పాటు పలువురు స్థానిక ప్రముఖులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# నేపాలీ వరదల్లో చిక్కిన బ్యాంకు..

- కోటిన్నర నగదు, 50 కోట్ల విలువైన బంగారం స్వాధీనం



**కాట్మాండు ,ఆగస్టు 31(వార్త సంధ్య )**

నేపాల్‌లోని త్రిశూలీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఓ గ్రామీణ బ్యాంకు నుంచి భారీ మొత్తంలో నగలు, ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బురదతో నిండిన వరద పోటెత్తిన ఘటనలో.. త్రిశూలీ దుంగేలో ఉన్న అగ్రికల్చర్ డెవలప్మెంట్ బ్యాంక్ బ్రాంచ్ ధ్వంసమైంది. వరద ప్రవాహించిన మార్గంలోనే ఆ బ్యాంక్ ఉన్నది. అయితే నేపాల్ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా చేపట్టారు. ఆకస్మిక వరదలతో ధ్వంసమైన ఆ ప్రాంతంలోని బ్యాంకు నుంచి లాకర్లను తీసేందుకు సుమారు 8 గంటల ఆపరేషన్ చేపట్టారు. ఆ బ్యాంకు శిథిలాల కింద ఉన్న లాకర్లను ఎట్టేకేలకు చేజిక్కించుకున్నారు.వివిధ లాకర్లలో ఉన్న సుమారు 1.5 కోట్ల నగదు, సుమారు 50 కోట్ల విలువైన బంగార ఆభరణాలను బ్యాంకు ఆఫీసర్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు బ్యాంకు లావాదేవీలకు చెందిన సున్నితమైన బ్యాంకింగ్ రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. నగదు, బంగారం, రికార్డులను .. హై సెక్యూర్టీ లొకేషన్‌కు తరలించారు. జల ప్రళయం వల్ల రసువా జిల్లా నుంచి కొట్టుకువచ్చిన మృతదేహాలను సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్వాన్‌లోని దేవఘడ్ ఫారెస్ట్‌లో గుర్తిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మార్నింగ్ వాక్‌కు ఫేమస్ అయిన ఆ అడవి ఇప్పుడు శ్మశాన వాటికగా మారింది.

# ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ భేటీ.



**న్యూఢిల్లీ,ఆగస్టు 31(వార్త సంధ్య )**

ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్సీవో) సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

# భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత


**కోల్‌కతా, ,ఆగస్టు 31(వార్త సంధ్య )**



భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# బెంగళూరులో 31 మంది బంగ్లా వలసదారులు అరెస్ట్!

**న్యూఢిల్లీ ,ఆగస్టు 31(వార్త సంధ్య )**



బెంగళూరు నగరంలో అక్రమంగా నివసిస్తున్న 31 మంది బంగ్లాదేశీయులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరిని గుర్తించి, పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాకు తరలించారు. దాదాపు బెంగళూరు నుంచి 20 మంది పోలీసు సిబ్బంది వీరిని తీసుకెళ్తున్నారు. మాల్దా నుంచి వీరిని బంగ్లాదేశ్‌కు డిపోర్ట్ చేయనున్నారు. అనుమానిత వ్యక్తులపై దృష్టి సారించి బెంగళూరు పోలీసులు 'ఆపరేషన్ ముక్త' చేపట్టారు. ఈ ఆపరేషన్ ఇంకా

# స్మశానవాటికలో క్షుద్రపూజలు

**-కాలుతున్న శవం నుంచి మాంసం తిన్న మంత్రగత్తె**

**భోపాల్ ,ఆగస్టు 31(వార్త సంధ్య )**

ఒక మంత్రగత్తె స్మశానవాటికలో క్షుద్రపూజలు చేసింది. చితిపై కాలుతున్న శవానికి చెందిన మాంసాన్ని ఆమె తిన్నది. తాము ఇలాగే చేస్తామని ఆ తాంత్రికురాలు పేర్కొన్నది. ఈ భయానక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక స్మశానంలో కాలుతున్న చితి వద్ద ఒక మంత్రగత్తె తాంత్రిక పూజలు చేస్తున్నట్లు కనిపించింది. కాళీనంద్ గిరిగా గుర్తించిన ఆమె ఒళ్లంతా బూడిద పూసుకుని, నల్లని వస్త్రం ధరించింది. ఒరలోంచి కత్తిని బయటకు తీసి మండుతున్న చితిలో ఎముకలు, పుర్రె, మాంసం



కోసం వెతికింది. కాలుతున్న శవానికి చెందిన ఒక మాంసం ముద్దను బయటకు తీసి తిన్నది. 'చూడండి. ఇది చాలా వేడిగా ఉన్నది. ఇప్పుడే మంటల నుంచి బయటకు తీశాను. ఇది రుచిగా ఉంటుంది. నాకు తెలిసిన చాలా మంది తాంత్రికులను చంపేశాను. నా విషయంలో జాగ్రత్తగా ఉండండి' అని ఆమె హెచ్చరించింది.కాగా, బూడిద పూసుకోవడం, మనుషుల పుర్రెలతో ఆడటం వంటివి తమ పని అని ఆ తాంత్రికురాలు తెలిపింది. 'మా గురించి మీకు తెలిసే ఉంటుంది. మేం మనుషులను ఇలాగే తింటాం. ఇదే మా జీవితం. మేం ఏమేమి చేస్తామో మీరు కనీసం ఊహించలేరు కూడా' అని ఆమె అన్నది. చివరలో ఒక మంత్రాన్ని కూడా ఆ మంత్రగత్తె జపించింది. అయితే ఈ సంఘటన ఏ స్మశానవాటికలో, ఎప్పుడు జరిగింది అన్నది తెలియలేదు. మరోవైపు ఆ తాంత్రికురాలి వికృత చర్యకు సంబంధించిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒక ఆచారంలో భాగంగా చితిపై కాలుతున్న మృతదేహాన్ని ఆమె విచ్ఛిన్నం చేసి, మానవ మాంసాన్ని తినడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపాలని చాలా మంది డిమాండ్ చేశారు.

# అస్సాం జైళ్లలో.. 200కు పైగా హెచ్ఐవీ కేసులు

**గువాహతి ,ఆగస్టు 31(వార్త సంధ్య )**

అస్సాంలోని పలు జైళ్లలో 200కు పైగా హెచ్ఐవీ కేసులు నమోదయ్యాయి. ఎయిడ్స్ సోకిన ఖైదీలకు యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్స అందిస్తున్నారు. అయితే అస్సాంలోని జైళ్లలో హెచ్ఐవీ కేసుల సంఖ్య పెరుగడం ఆందోళన కలిగిస్తున్నది. ఆ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31 జైళ్లలోని ఖైదీలకు హెచ్ఐవీ స్క్రీనింగ్ నిర్వహించారు. గత నాలుగు నెలల్లో 226 మంది ఖైదీలకు ఎయిడ్స్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. గత వారం శ్రీభూమి జిల్లా జైలులో హెచ్ఐవీ పాజిటివ్ ఖైదీల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఈ జైలులో 445 మంది ఖైదీలు ఉండగా వారిలో 11 మందికి హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ



అయింది. ఈ 11 మందిలో ఒక మహిళా ఖైదీ కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. తాజాగా శ్రీభూమి జిల్లా జైలులో హెచ్ఐవీ కేసులు బయటపడటం జిల్లా వ్యాప్తంగా ఆందోళన రేకెత్తించింది.కాగా, అస్సాం జైళ్లలో హెచ్ఐవీ సోకిన 95 శాతం మంది ఖైదీలు ఇంజెక్షన్ ద్వారా మాదకద్రవ్యాలు తీసుకున్నవారేనని అధికారులు తెలిపారు. 31 జైళ్లలోని హెచ్ఐవీ పాజిటివ్‌గా ఉన్న 226 మంది ఖైదీలలో 202 మంది యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్స పొందుతున్నట్లు వివరించారు. మరోవైపు అస్సాం జైళ్లలోని ఖైదీలకు హెచ్ఐవీ సోకడం ఆందోళన కలిగిస్తున్నదని ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తెలిపారు. జైళ్లలోని ఖైదీలకు మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నదని చెప్పారు. అస్సాంలో సుమారు 33,000 మంది హెచ్ఐవీ లేదా ఎయిడ్స్ రోగులు ఉన్నారని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి అశోక్ సింఘాల్ వెల్లడించారు.

# ఆడవాళ్లు ఇంటికే పరిమితం కావాలి

**కేరళలో ముస్లిం మత గురువు వివాదాస్పద వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ ,ఆగస్టు 31(వార్త సంధ్య )**

మహిళల గురించి కేరళకు చెందిన ఒక ముస్లిం మతగురువు వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఆడవాళు ఇంటికే పరిమితం కావాలని సూచించాడు. మత గురువు, కాంతాపురం సమస్త కేరళ జామియ్యతుల్ ఉలామా జనరల్ సెక్రెటరీ ఏపీ అబూబాకర్ ముస్లియార్ ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆదివారం కోచిలోని, కాంతాపురంలో ఒక మత సంబంధమైన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారుగతవారం ఈ సంస్థ తరఫున ఒక ఆదేశం జారీ చేశారు. దీని



ప్రకారం.. మహిళలు మత పరమైన కార్యక్రమాలు, ఇతర వేడుకల్ని నాలుగు గోడల మధ్య, ఇంట్లోనే నిర్వహించుకోవాలి. మగవారితో కలిసి మహిళలు ఎలాంటి బహిరంగ వేదిక పంచుకోకూడదు. అలాగే, ప్రజలకు సంబంధించిన బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. అయితే, ఈ ప్రకటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కేరళకు చెందిన పలువురు మహిళా నేతలు ఈ ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు బయటకు రాకుండా ఉండేలా ఆదేశించడంపై మండిపడ్డారు. ఇప్పుడు ఇదే అంశంపై ఆ ముస్లిం సంస్థకు చెందిన మత గురువు అబూబాకర్ స్పందించాడు. ఈ ఆదేశాల్ని సమర్థించాడు. మహిళలు ఇంటికే పరిమితం కావాలని సూచించాడు. మగవారితో బహిరంగ వేడుకల్ని పంచుకోకూడదన్నాడు. వారు బయటకు రావడం వల్ల భారీ వినాశనం సంభవిస్తుందని, దానిని నివారించేందుకే పరదాల్ని సూచించిందని అబూబాకర్ వ్యాఖ్యానించాడు. ఇలాంటి విషయాలు చెప్పడంలో తమను ఎవరూ ఆపలేరని అతడు అన్నాడు. తాము ఎన్నో ఏళ్లుగా మతాన్ని అనుసరిస్తున్నామని, అందువల్ల తమకు అలా చెప్పే అధికారం ఉందని వివరించాడు. అయితే, అతడి వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీలో దారుణాలు.

**-మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి..**

**-బస్సులో యువతిపై గ్యాంగ్ రేప్**

**న్యూఢిల్లీ ,ఆగస్టు 31(వార్త సంధ్య )**

దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటనలు జరిగాయి. కదిలే బస్సులో యువతిపై నిర్భయ తరహా అత్యాచార ఘటన జరిగింది. మరో ఘటనలో ఒక స్కూల్‌లో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వివరాలివి.

**మూడేళ్ల చిన్నారిపై స్కూల్ బస్సు డ్రైవర్..**

ఢిల్లీలోని బవానా ప్రాంతంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో నర్సరీ చదువుతున్న చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ దారుణానికి పాల్పడింది బస్సు స్కూల్ డ్రైవర్. మూడేళ్ల నర్సరీ విద్యార్థిని మర్మావయవాలపై గాయాలుండటాన్ని ఆగస్టు 19న చిన్నారి తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో ఆ గాయాలు ఎలా అయ్యాయని చిన్నారిని తల్లిదండ్రులు అడిగారు. స్కూల్‌లో ఒక బ్యాడ్ అంకుల్ తనకు రోజూ చాక్లెట్లు ఇచ్చి, ఇబ్బంది పెడుతున్నాడని చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులకు జరిగిన విషయం అర్థమైంది. వెంటనే వారు పోలీసులకు, స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆ పాపకు ఇంకా మాటలు కూడా సరిగ్గా రావు. ఆ చాక్లెట్లు ఇచ్చిన అంకుల్ ఎవరో చిన్నారి గుర్తించలేదు. అతడి గురించి స్పష్టమైన వివరాలు చెప్పలేకపోయింది. అయితే, స్కూల్‌లో పని చేసే సిబ్బందికి సంబంధించి సీసీటీవీ వీడియో దృశ్యాలు, ఫొటోగ్రాఫ్‌లు చూపించారు. వాటిలో నిందితుడిని ఆ చిన్నారి గుర్తించింది. నిందితుడిని బస్సు డ్రైవర్ వికాస్‌గా గుర్తించారు. చిన్నారి వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో పాప వెంటే వెళ్లేవాడు. చాక్లెట్ల ఆశచూపి, అక్కడి **మెట్లకిందికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.**



గతంలో నాలుగుసార్లు అలా చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డట్లు తేలింది. గతంలో కూడా పలువురు చిన్నారులకు నిందితుడు చాక్లెట్లు ఇవ్వడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది. దీంతో ఆ ఘటనలపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. పాప ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. స్కూల్ ఆవరణలోనే వికాస్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై**

మరో ఘటనలో.. కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఢిల్లీలోని కాశ్మీరే గేట్ ఏరియాలోని ఖాళీగా ఉన్న ఒక స్లీపర్ బస్సులో ఈ ఘటన ఆగస్టు 4న జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లోని మణిపురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల యువతి ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వచ్చేసింది. తన ఊరు నుంచి నోయిడాలోని తన బంధువు దగ్గరికి వెళ్లాలనుకుంది. ఈ క్రమంలో ఒక బస్సు ఎక్కింది. అయితే, వర్షం, చీకటి కారణంగా మధ్యలోనే పారి చౌక్ ప్రాంతంలో పొరపాటున దిగేసింది. ఇదే సమయంలో అటు నుంచి ఒక స్లీపర్ బస్సు వెళ్తూ కనిపించింది.

దీంతో ఆ బస్సును ఆపాల్సిందిగా యువతి సిగ్నల్ ఇచ్చింది. యువతి ఒంటరిగా ఉండటాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు, డ్రైవర్.. తాము కూడా నోయిడాలోని సెక్టార్ 63కే వెళ్తున్నామని చెప్పారు. ఆమెను కావాల్సిన చోట దింపుతామని చెప్పి బస్సులో ఎక్కించుకున్నారు. యువతి బస్సు ఎక్కిన తర్వాత ఆమెపై బస్సు కండక్టర్, తర్వాత డ్రైవర్.. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. అత్యాచారం అనంతరం యువతిని కాశ్మీర్ గేట్ సమీపంలో దింపేసి వెళ్లిపోయారు. అనంతరం బాధిత యువతి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌ను అరెస్టు చేశారు. బస్సును సీజ్ చేశారు.

vaartha sandhya వార్త సంధ్య



# రొమ్ము క్యాన్సర్‌కు ఈ ఆహారంతో చెక్

మహిళల ఆరోగ్యానికి ఏ ఆహారం తింటే మంచిది? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రతి నెలా రుతుక్రమ సమస్యల్ని ఎదుర్కొనే మహిళలు ఎలాంటి ఆహారం తీసుకుంటే మంచిదో వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవలికాలంలో మహిళలు రొమ్ముక్యాన్సర్ బారినపడేవారు ఎక్కువగా ఉంటున్నారు. మరి వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందామా?! ఇటీవల కాలంలో మహిళలు ఆరోగ్యంపై కాస్తంత దృష్టి పెడుతున్నారు. ఉదయాన్నే వ్యాయామాల కోసం సమయం వెచ్చిస్తున్నారు. లేకపోతే వ్యాయామాలు చేయకపోయినా.. ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు. వాటిల్లో ప్రధానంగా చెప్పుకోవాలంటే.. పచ్చి ఆకుకూర ముక్కలు, నానబెట్టన చిరు ధాన్యాలు ముందు వరుసలో ఉంటున్నాయి. వీటిని రోజూ ఆహారంలో భాగంగా తీసుకుంటే.. మహిళలు రొమ్ము క్యాన్సర్ బారినపడకుండా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

-- కూరగాయల ముక్కలు, నానబెట్టిన చిరుధాన్యాల్ని ఉదయాన్నే తీసుకుంటే... మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. అధిక రక్తపోటుకు గురికాకుండా ఉంటారు. మధుమేహులకు కూడా ఇవి మంచిది.

- ఎముకలకు బలాన్ని చేకూరుస్తాయి. వీటిని తీసుకుంటే త్వరగా బరువు తగ్గుతారు.

అమెరికాలో 25 సంవత్సరాలు ఉన్న 25 వేల మంది మహిళలపై పరిశోధించగా.. వారు పచ్చి కూరగాయల ముక్కల్ని తీసుకుంటే.. అధిక బరువుకి దూరంగా ఉన్నారని తాజా అధ్యయనంలో తేలింది.



# వేసవిలో ఉప్పు నీటిని తాగితే ఆరోగ్య ప్రయోజనాలెన్నో!

ఇంటర్నెట్‌డెస్క్

వేసవిలో విపరీతమైన ఎండల వల్ల చెమటలు పట్టడం డీహైడ్రేషన్‌కి గురవ్వడం జరుగుతుంటుంది. రోజుకి ఎన్ని నీటిని తాగినా సరే నోరు ఎండిపోతుంది. చల్లని నీరు లేదా, కొబ్బరి నీళ్లు ఇలా రకరకాలుగా పానీయాలు తీసుకున్నా సరే ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ కాలంలో నీటిలో చిటికెడు ఉప్పు కలుపుకుని తాగితే ఆరోగ్యానికి మంచిదని, ముఖ్యంగా డీహైడ్రేషన్‌కి గురయ్యే ప్రమాదం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

-- వేసవిలో విపరీతంగా చెమట పడుతుంది. దీంతో చెమట రూపంలో సోడియం మాత్రమే కాకుండా ముఖ్యమైన ఎలక్ట్రోలైట్లను కూడా కోల్పోతాము. అందుకే నీటిలో ఉప్పును కలిపి తాగితే తిరిగి శరీరానికి సోడియం అందుతుంది. తద్వారా డీహైడ్రేషన్ నుంచి కూడా తప్పించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

-- ఉప్పు నీటిని అందరూ తీసుకోకూడదు. రక్తపోటు అధికంగా ఉన్నవారు మాత్రం తప్పనిసరిగా ఉప్పునీటిని తీసుకోబోయే వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

-- మూత్రపిండాల పనితీరు సాధారణంగా ఉన్న వ్యక్తులు కూడా ఉప్పునీటిని తీసుకోవాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

# గొంతు గర గర పోవాలంటే



ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఈ సమయంలో బ్యాక్టీరియా మన శరీరంపై దాడికి సిద్ధమవుతుంది. ముఖ్యంగా గొంతు సమస్యలు తెగ ఇబ్బంది పెడతాయి. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ఏవో బ్యాక్టీరియా ప్రవేశిస్తోందని, వాటిపై మన రోగ నిరోధక శక్తి పోరాడుతోందని అర్థం. జలుబు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకు దారితీస్తాయి. దీన్ని సులభంగా దూరం చేసుకోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

-- గోరు వెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు వేసి తాగాలి. ఇలా చేస్తే గొంతులో గరగర మాయమవుతుంది.

-- అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీ పొడి కలిపి టీ పెట్టుకొని తాగాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే ఫలితం కనిపిస్తుంది.

-- అల్లాన్ని మెత్తగా నూరి, టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగినా మంచి ఫలితం ఉంటుంది.

-- పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆకులు తీసివేసి, ఆ నీళ్లు తాగాలి.

# మామిడి పండ్లు తినగానే ఇవి తీసుకుంటున్నారా..

## అయితే మీ ఆరోగ్యాన్ని రిస్క్‌లో పెట్టినట్లే..!

**వేసవి ఆగమనంతోనే మార్కెట్‌లోకి మామిడి పండ్ల (ఫలరాజం) రాక మొదలవుతుంది. మన దేశం మామిడి పండ్లకు ఎంతో ప్రసిద్ధి. ప్రపంచంలో మరెక్కడా లభించనన్ని రకాల మామిడి పండ్లు భారత్ లో లభిస్తాయి. అంతేకాదు దేశంలోని మామిడిపండ్లు రకరకాల రుచుల్లో అందుబాటులో ఉంటాయి. ఈ మామిడి పండ్లను నేరుగా తినొచ్చు. జ్యూస్‌లుగా చేసుకుని తాగవచ్చు. మామిడి తాండ్ర, మామిడి కరేలా లాంటి పదార్థాలు తయారు చేసుకుని కూడా తినొచ్చు. అయితే ఈ మామిడిపండ్లు తిన్న తర్వాత ఓ ఐదు రకాల పదార్థాల జోలికి అస్సలు పోవద్దట. ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం..**

మంచి నీళ్లు : మామిడి పండ్లు తిన్న తర్వాత కొంతసేపటి వరకు మంచినీళ్లను అస్సలు తాగొద్దట. అలా చేస్తే ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందట. కడపు నొప్పి, అసిడిటీ, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట.

పెరుగు : మామిడి పండు తినగానే పెరుగు తీసుకుంటే శరీరం డీహైడ్రేట్ అవుతుందట. అందువల్ల అలాంటి అలవాటు ఉంటే తక్షణమే మానుకోవాలట. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందట. అంతేగాక చర్మ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉన్నదట.

కాకరకాయ : మామిడి పండ్లు తిన్న తర్వాత కాకరకాయ తీసుకోవడం కూడా మంచిది కాదట. అలా చేయడంవల్ల వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయట.

ఘాటైన పదార్థాలు : మామిడి పండ్లు తిన్న తర్వాత ఘాటు పదార్థాలుగానీ, కారం పదార్థాలుగానీ తీసుకుంటే ఉదర సంబంధ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట. అంతేగాక ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం కూడా ఉన్నదట.


చల్లటి పానీయాలు : మామిడి పండ్లతోపాటు చల్లటి పానీయాలు తీసుకోవడం కూడా ఆరోగ్యానికి హానికరమట. చల్లటి పానీయాలతో మామిడి పండ్లను తీసుకోవడంవల్ల షుగర్ లెవల్స్ మరింత పెరుగుతాయట.



వార్త సంధ్య

# శ్రీవిష్ణు నుంచి మరో కొత్త సినిమా.


## కామెడీకి దూరంగా ఎమోషనల్ కథతో వస్తున్న యంగ్ హీరో!




వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు.. ఈసారి మాత్రం సరికొత్త ఎమోషనల్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హారికా హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ గ్లింప్స్ విడుదల చేశారు.తాజాగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనే ఓ సాధారణ మధ్యతరగతి అబ్బాయి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతల కారణంగా తన ఆశలను పక్కన పెట్టి సాధారణ జీవితాన్ని కొనసాగించే పరిస్థితిని ఇందులో చూపించినట్లు తెలుస్తోంది. మంచి కాలేజీలో చదవాలనే కోరిక ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా సాధారణ కాలేజీలో చదవడం.. జీవితంలో ఎన్నో సాధించాలని ఆశించినా కుటుంబ బాధ్యతల కోసం ఉద్యోగం చేయడం.. ఇలా ఎంతోమంది మిడిల్ క్లాస్ యువకుల జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. శ్రీవిష్ణు సినిమాలంటే సాధారణంగా కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు డిఫరెంట్ కాన్సెప్ట్‌లు గుర్తుకొస్తాయి. అయితే ఈసారి ఆయన అందుకు భిన్నంగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. తన కలలను, ఆశలను కుటుంబం కోసం త్యాగం చేసే మిడిల్ క్లాస్ యువకుడి పాత్రలో శ్రీవిష్ణు కనిపించనున్నారని సమాచారం. గ్లింప్స్‌లో చూపించిన సన్నివేశాలు కూడా పాత్రలోని ఎమోషన్‌ను హైలైట్ చేసేలా ఉన్నాయి. దీంతో ఈ సినిమా శ్రీవిష్ణు కెరీర్‌లో మరో డిఫరెంట్ మూవీగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను మాత్రం ప్రకటించలేదు. కథ, పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ రాబోయే రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది. శ్రీవిష్ణు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.

# బాలయ్య కొత్త సినిమాకు రెండక్షరాల టైటిల్ ఫిక్స్ ..

## -సెప్టెంబర్ 6న భారీ ప్రకటన




నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ చీదీఖ111పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన ఈ కాంబినేషన్ మరోసారి చేతులు కలపడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మొదటి నుంచే ఉంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లిమ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.తాజాగా ఈ మూవీకి సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా అధికారిక టైటిల్‌తో పాటు థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను సెప్టెంబర్ 6న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో నందమూరి అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది.చీదీఖ111 కోసం ఇప్పటికే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. '+ూణ', 'ణూణూ' (దాదా) అనే టైటిల్స్‌లో ఒకదాన్ని సినిమాకు ఖరారు చేసే అవకాశం ఉందని టాక్ వచ్చింది.బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్ ఎలిమెంట్స్‌కు ఈ రెండు టైటిల్స్ బాగా సెట్ అవుతాయని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం 'దాదా' టైటిల్‌నే దాదాపుగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.అయితే దీనిపై అధికారిక క్లారిటీ మాత్రం సెప్టెంబర్ 6న రానుంది. ఆ రోజే టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. గోపీచంద్ మలినేని ఈసారి బాలయ్యను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. సినిమా కథ ముంబై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం.బాలకృష్ణ ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు పవర్‌ఫుల్ డైలాగ్స్, మాస్ ఎలివేషన్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టాక్. బాలయ్య పాత్రను దర్శకుడు మరింత స్టైలిష్‌గా, మాస్ యాంగిల్‌లో డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మరో ఆసక్తికరమైన అంశం మంచు మనోజ్ విలన్‌గా నటిస్తుండటం. బాలకృష్ణకు ప్రత్యర్థిగా మనోజ్ పవర్‌ఫుల్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య, మనోజ్ మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు కీలకంగా ఉంటాయని తెలుస్తోంది. ఇద్దరు మాస్ యాక్టర్స్ ముఖాముఖి తలపడే సన్నివేశాలు అభిమానులకు మంచి ట్రీట్ ఇస్తాయని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మరోవైపు ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. బాలయ్య సినిమాలకు తమన్ అందించే మాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండటంతో ఈ సినిమాపైనా అంచనాలు పెరిగాయి.

# 'ఆదర్శకుటుంబం' కోసం క్లాసిక్ సాంగ్ రీమేక్?



తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47' సినిమా ముందు వరుసలో ఉంటుంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. ఆ సినిమాల విజయాల్లో వెంకటేశ్ నటన, త్రివిక్రమ్ రచన ప్రధాన పాత్రలు పోషించాయనడం అతిశయోక్తి కాదు. అప్పుడు వెంకటేశ్ సినిమాకి రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. ఇప్పుడు అదే వెంకటేశ్‌ని డైరెక్ట్ చేస్తున్నారు. దాంతో 'ఆదర్శకుటుంబం' సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఆకాశమంత ఏర్పడ్డాయి. అక్టోబర్ 2న గాంధీజయంతి కానుకగా సినిమా విడుదల కానున్నది ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఓ అసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నది. ఆ వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్ చిత్ర విజయాల్లో 'కూలీ నెం 1' సినిమా ఒకటి. ఆ సినిమాలోని 'దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా.. దయుంచయ్యా దేవా..' సాంగ్ ఎంత హిట్టో అందరికీ తెలిసిందే. వినాయకచవితి పందిళ్లలో నేటికీ ఈ పాట మారుమోగుతూనే ఉంది. ఆ పాటను ఈ సినిమా కోసం రీమేక్ చేస్తున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే.. సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణ కాకమానదు.క్లైమాక్స్, ఓ పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని టాక్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రీనిధిశెట్టి కథానాయిక. నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావురమేశ్, సత్య, బ్రహ్మాజీ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈచిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే.



# ఆమె వల్లే పేరు మార్చుకున్నా..

వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన బాధ్యతలనూ రెండిటినీ సమానంగా ఎంజాయ్ చేస్తుంటారు నటి కియారా అద్వానీ. పెళ్లి, ప్రెగ్నెన్సీ, పేరెంట్‌హుడ్.. ఇలా జీవితంలో ఎన్ని కొత్త దశలు వచ్చినా ఆమె కెమెరాకు బ్రేక్ ఇవ్వకపోవడానికి కారణం అదే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలోని ఆసక్తికరమైన అంశాలను కియారా వెల్లడించారు. 'మా అమ్మ టీచర్. నేనూ అమ్మలా టీచర్ కావాలనుకున్నా. కానీ నటిని అయ్యాను. డెస్టినీ అంటే అదే. నా అసలు పేరు ఆలియా. నేను ఇండస్ట్రీకి వచ్చేనాటికే అలియాభట్ పాపులర్. అందుకే పేరు మార్చుకోవాల్సి వచ్చింది. 'అంజానా అంజానీ' సినిమాలో ప్రియాంక చోప్రా పోషించిన 'కియారా' పాత్రంటే నాకెంతో ఇష్టం.అందుకే ఆ పాత్ర పేరునే నా పేరుగా మార్చుకున్నా. 'ఫగ్లీ'తో నా కెరీర్ మొదలైనా, 'ఎంఎస్ ధోని: ది అన్ టోల్డ్ స్టోరీ' చిత్రం నా కెరీర్‌ని మలుపు తిప్పింది. అందులో నేను పోషించిన 'సాక్షి' పాత్ర నన్ను స్టార్‌ని చేసింది. కెరీర్ అనేది కొన్నాళ్లు కొనసాగాలంటే ఫిట్‌గా ఉండాలి. అందుకే వర్కవుట్లు బోరింగ్ అయినా తప్పడం లేదు. ఫిట్‌నెస్ కోసం కిక్ బాక్సింగ్ లాంటివి కూడా చేస్తాను. యాక్షన్ సినిమాలు చేసేటప్పుడు ఆ ట్రైనింగ్ ఉపయోగపడుతుంది. ఖాళీ సమయాల్లో ఇంట్లో కూర్చొని బొమ్మలు గీస్తుంటా. నా బ్యాగ్‌లో ఎప్పుడూ ఓ బుక్, స్కెచ్ పెన్స్, పెన్సిల్స్ ఉంటాయి. అలాగే ఆమెరికన్ సిరీస్, సైకలాజికల్ థ్రిల్లర్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తా' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు కియారా అద్వానీ


# పిల్లితో మొదలైన మిస్టరీ..

## 'హతః' టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి పెంచిన కిరణ్ అబ్బవరం!




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు.అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. "Is the cat alive or.." అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్బు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# 'తెల్లకాగితం' విడుదల అప్పుడే



'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు హర్ష్‌రోషన్, నక్షత్ర ఎంతో క్యూట్‌గా కనిపిస్తున్నారు.కురుస్తున్న వర్షపు చినుకులు, గొడుగులా అడ్డు పెట్టుకున్న అరిటాకు, నాయకానాయికల రొమాంటిక్ లుక్స్.. ఇవన్నీ ఎంతో సహజంగా.. సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచిందని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగాన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.